Sweken IT Solutions
WE ARE HIRING !!
➤ NET Developers
➤ Data Entry
INTERESTED CANDIDATES PLEASE SEND YOUR RESUME TO
MAIL: careers@sweken.com
PH: 9100986585

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

COMMERCIAL SPACE FOR RENT
3800 Square feet, 1st Floor,
Door.No.1-83-10/1, HIG-98
Sector-1, Double Road,
MVP Colony, Visakhapatnam-17
Opposite to House of Spice
Contact :
9866333203
9849258010

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 150 విశాఖపట్నం, 25 మార్చి 2025 మంగళవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## తాగునీటి ఎద్దడి లేని రాష్ట్రంగా ఏపీ



### అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా తాగునీటి ఎద్దడి కనిపించ కూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. నిత్యం నమోదవుతున్న ఉష్ణోగ్రతల సమాచారాన్ని మొబైల్ అలర్ట్స్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ మేరకు వేసవి ప్రణాళికపై డిజాస్టర్ మేనేజ్‌మెంట్, పంచాయతీ రాజ్, మున్సిపల్, వైద్యారోగ్య శాఖల అధికారులతో సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తలతో వడదెబ్బ మరణాలు తగ్గించాలన్నారు. తీవ్ర వడగాలులు వీచే అవకాశమున్న ప్రాంతాల్లో మజ్జిగ కేంద్రాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పాఠశాలల్లో వాటర్ బెల్ విధానం అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అడవుల్లో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని.. ఎప్పటికప్పుడు డ్రోన్లతో పరిస్థితిని పర్యవేక్షించాలని సీఎం సూచించారు.

**పీ-4తో మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం**

సంపన్నులు-పేదలను ఒకే చోటకు చేర్చడమే లక్ష్యంగా పీ-4 విధానాన్ని రూపొందించినట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అ విధానంలో భాగస్వాములు కావడానికి ఎన్నారైలతో సహా ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు రావొచ్చన్నారు. ఈ విధానం అమలు ప్రక్రియలో అండగా నిలిచేవారిని మార్గదర్శిగా, లబ్ధిపొందే కుటుంబాలను బంగారు కుటుంబాలుగా వ్యవహరిస్తామన్నారు. పీ-4 విధానంపై సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ విధానం అమలు తీరుపై సీఎం స్పష్టత ఇచ్చారు. పీ4 అమల్లో భాగంగా.. తొలుత గ్రామ, వార్డు సభల ద్వారా లబ్ధిపొందే కుటుంబాల జాబితా రూపొందిస్తారు. మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని సీఎం తెలిపారు. 2029 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలనేదే సంకల్పంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఉగాది పండుగ రోజు అమరావతిలో పీ-4 విధానాన్ని ప్రారంభించనున్నట్లు సీఎం చెప్పారు. పేదరిక నిర్మూలన కోసం ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని, ఈ కార్యక్రమానికి ప్రభుత్వ పథకాలకూ ఎలాంటి సంబంధం లేదని చంద్రబాబు తెలిపారు.

## బీచ్ పర్యాటకానికి మరింత ఊతం



- అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి
- భూములు అన్యాక్రాంతమైతే కఠిన చర్యలు - మంత్రి కందుల దుర్గేష్
- రుషికొండ బీచ్ లో బ్లూఫ్లాగ్ జెండా ఆవిష్కరణ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఇక్కడి ప్రఖ్యాత రుషికొండ బీచ్‌లో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఉదయం బ్లూఫ్లాగ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రుషికొండ బీచ్ వద్ద మీడియా సమావేశంలో మంత్రి ప్రసంగిస్తూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ తాత్కాలికంగా రద్దు అయిందని, తమ దృష్టికి రాగానే వెంటనే దాన్ని పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. అంతర్జాతీయ పర్యాటకుల ఆకర్షణకు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ తోడ్పడుతుందని ఈ నేపథ్యంలో బీచ్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ బీచ్ లో బ్లూ ఫ్లాగ్ నిరంతరంగా మిగతా 2లో




## క్యాంపు రాజకీయం షురూ!



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖలో క్యాంపు రాజకీయం మొదలైంది. మేయర్ కొలగాని హరి వెంకట కుమారిపై అవిశ్వాస తీర్మానం నోటీసులతో వైసీపీ అధిష్ఠానం అలర్ట్ అయింది. ఎలాగైనా సరే జీవీఎంసీ పీఠాన్ని నిలబెట్టుకోవాలని అడుగులు వేస్తోంది. ...(మిగతా 2లో)

- విశాఖ మేయర్ అవిశ్వాస తీర్మానానికి కూటమి సిద్ధం.. వైసీపీ అలర్ట్
- బెంగళూరుకు ఆ పార్టీ కార్పొరేటర్లు
- అవిశ్వాసం రోజే మళ్లీ తిరిగి విశాఖకు..

### టీటీడీ ఆస్తుల పరిరక్షణకు కమిటీ 2లో

### సమస్యల పరిష్కార బాధ్యత అధికారులదే : కలెక్టర్

## పార్లమెంట్‌లో అరకు కాఫీ ఘుమఘుమలు



**ఢిల్లీ:** పార్లమెంట్ ప్రాంగణంలో కాఫీ స్టాళ్లను ఏర్పాటు చేశారు. స్పీకర్ ఓం బిర్లా అనుమతితో గిరిజన కోఆపరేటివ్ సొసైటీ.. ఎంపీలు అల్పాహారం తీసుకునే సంగం క్యాంటీన్‌లో రెండు స్టాళ్లను ఏర్పాటు చేసింది. సంగం 1, 2 కోర్టు యార్డ్ వద్ద స్టాళ్ల ఏర్పాటుకు స్పీకర్ ఓం బిర్లా ఇటీవల అనుమతించారు. ఆయన ఆదేశాలతో రెండు స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలని లోక్‌సభ భవనాల డైరెక్టర్ కుల్ మోహన్ సింగ్ అరోరా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు లోక్ సభ క్యాంటీన్లో అరకు స్టాల్ ను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, రాజ్యసభ క్యాంటీన్లో వాణిజ్య వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి ...(మిగతా 2లో)

## విద్యార్థి వీసాలకు అమెరికా కత్తెర

- 41 శాతం దరఖాస్తుల తిరస్కరణ

**ఇంటర్నెట్ డెస్క్:** విదేశాల్లో పైచదువులు చదవాలన్నది చాలామంది కల. అందులోనూ అమెరికాలో ఉన్నతవిద్య అభ్యసించేందుకు మరింత ఎక్కువ ఇష్టపడుతుంటారు. అలా చాలా దేశాల నుంచి ఏటా ఎంతోమంది విద్యార్థులు అగ్రరాజ్యానికి వెళ్తుంటారు. అయితే, గత కొంతకాలంగా ఈ విద్యార్థి వీసాల సంఖ్యకు అమెరికా సర్కారు భారీగా కత్తెర వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 41శాతం వీసా దరఖాస్తులను తిరస్కరించింది. దశాబ్దం క్రితంతో పోలిస్తే




ఎఫ్-1 వీసాల తిరస్కరణ దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ...(మిగతా 2లో)



### రన్‌వేపై అదుపుతప్పిన విమానం 2

శిమ్లాలో త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం

## ఐదేళ్లలో టోల్ ట్యాక్స్ వసూలు రూ. 1.93 లక్షల కోట్లు




**న్యూఢిల్లీ :** దేశంలోని అన్ని జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల నుంచి గడచిన ఐదేళ్లలో అక్షరాలా రూ.1.93 లక్షల కోట్లు ప్రభుత్వానికి టోల్ ట్యాక్స్ రూపంలో అందింది. దీనికి సంబంధించిన వివరాలను రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ లోక్‌సభలో వెల్లడిరచింది. ప్రభుత్వం అందించిన డేటా ప్రకారం దేశంలోనే అత్యధిక టోల్ ట్యాక్స్‌ను గుజరాత్‌లోని ఎన్‌హెచ్-48లోని వడోదర-భరూచ్ సెక్షన్‌లో ఉన్న టోల్ ప్లాజా వసూలు చేసింది. గడచిన ఐదు ఆర్థిక సంవత్సరాల్లో (2019-20 నుండి 2023-24 వరకు) రూ.2,043.81 కోట్ల టోల్ వసూలు చేసింది. టోల్ ఆదాయాల జాబితాలో రాజస్థాన్‌లోని షాజహాన్‌పూర్ టోల్ ప్లాజా రెండవ స్థానంలో నిలిచింది. ఇది ఎన్‌హెచ్-48లోని గుర్గావ్-కోట్‌పుట్లి-జైపూర్ విభాగంలో ఉంది. గత ...(మిగతా 2లో)

## జస్టిస్ యశ్వంత్‌వర్మ విధులకు దూరం

- నోట్ల కట్టల వ్యవహారంలో రిజిస్ట్రీ నిర్ణయం



**ఢిల్లీ :** నోట్లకట్టల ఆరోపణల వేళ జస్టిస్ యశ్వంత్ వర్మ విషయంలో ఢిల్లీ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీఎత్తున నోట్ల కట్టలు బయట పడినట్లు వచ్చిన వార్తలు సంచలనం సృష్టించాయి. ఈ నేపథ్యంలో ఆయనను న్యాయ పరమైన విధులకు దూరంగా ఉంచుతూ ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రీ నిర్ణయం తీసుకుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని తెలిపింది. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్నిప్రమాదం సందర్భంగా ...(మిగతా 2లో)




## శారదా పీఠానికి బిగ్ షాక్!

- వారంలోగా కట్టడాలు తొలగించాలని నోటీసులు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ చినముషిడివాడలోని శారదా పీఠానికి బిగ్ షాక్ తగిలింది. పీఠం కట్టడాలను తొలగిలించాలని జీవీఎంసీ నోటీసులు జారీ చేసింది. వారం వరకూ చూస్తామని లేనిపక్షంలో తామే తొలగిస్తామని పేర్కొంది. అంతేకాదు తొలగింపునకు అయ్యే ఖర్చును శారదాపీఠం నుంచి వసూలు చేస్తామని వెల్లడిరచింది. కాగా విశాఖ జిల్లా పెందుర్తి మండలం చినముషిడివాడలో శారదాపీఠానికి కేటాయించిన 15 ఎకరాల భూముల అనుమతులు ఇప్పటికే కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. విశాఖ శారదాపీఠం ఇష్టారాజ్యంగా భూములను ఆక్రమించిందనే ఆరోపణలు ఉన్నాయి. సర్వే నెం.90లో ఉన్న రహదారి భూమిని ఆక్రమించిందని, అది ప్రభుత్వ భూమి అని, అందులో నిర్మాణాలు చేసినట్లు జీవీఎంసీ సైతం గుర్తించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఈ భూముల్లో ఉన్న అక్రమ నిర్మాణాలను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా నోటీసులు జారీ చేసింది. ఆక్రమించుకున్న రహదారి భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోకూడదో, అక్రమ నిర్మాణాలను ఎందుకు జప్తు చేయకూడదో వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో జీవీఎంసీ పేర్కొంది.

## విశాఖ అమ్మాయి.. తొలియత్నంలోనే గ్రూప్-1లో విజయం

- గుంటూరు సౌత్ డీఎస్పీగా పనిచేస్తున్న భానోదయ
- కూచిపూడిలో నృత్యంలోనూ గిన్నిస్ బుక్ రికార్డు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అకుంఠిత దీక్షతో గెలుపుతీరాలను చేరొచ్చని నిరూపించారు. గొందేశి భానోదయ. తండ్రి మరణించినా ఆమె కుంగిపోలేదు. మొక్కవోని ధైర్యంతో.. తల్లి ప్రోత్సాహంతో ముందడుగు వేశారు. తన కోసం తల్లి పడే కష్టాన్ని చూసి చదువుతో పాటు కూచిపూడి నృత్యంపైనా శ్రద్ధపెట్టారు. నృత్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి అందరినీ ఆశ్చర్య పరిచారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు చలించిన ఆమె వాటి నివారణకు తనవంతు కృషి చేయాలని తలంచి గ్రూప్-1కు సిద్ధమయ్యారు. తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు. ప్రస్తుతం గుంటూరు సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

విశాఖ ప్రాంతానికి చెందిన భానోదయ తండ్రి రమణారెడ్డి స్టీల్ ప్లాంటులో చిరుద్యోగి. ఈమెకు తల్లి, ఓ సోదరి కూడా ఉన్నారు. చిన్ననాటి నుంచి కూచిపూడి నాట్యంపై అభిరుచితో తర్ఫీదు పొందారు. సిలికాన్ ఆంధ్ర సంస్థ వెయ్యి ...(మిగతా 2లో)

# ప్రజా సమస్యల పరిష్కార బాధ్యత అధికారులదే

**జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 309 విజ్ఞప్తులు**



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్) లో వచ్చిన అర్జీలను 24 గంటలలోపు ఓపెన్ చేసి, పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత వ్వడంతో పాటు అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి వారితో ముఖాముఖీ మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా కలెక్టర్ తో పాట, .జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ వినతులు స్వీకరించారు.

**అధికారులతో సమీక్ష**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో జిల్లాకలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తుం దన్నారు. సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చే అర్జీలను జిల్లాస్థాయి అధికారులు అత్యంత ప్రాధాన్య తతో తక్షణమే అర్జీదారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశం చారు. జిల్లాలో వచ్చిన అర్జీలే తరచుగా రావడం పట్ల అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ శాఖలలో పెండిరగ్ లో ఉన్న అర్జీల పై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. వీఎంఆర్డీఏ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలలో పెండిరగ్ లో ఉన్న కోర్టు కేసులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అదేశించారు. ప్రజలు వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, చేపట్టవలసిన చర్యల గురించి తెలియజేసే గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కాగా సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 309 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 123 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 36, జీవీఎంసీ సంబంధించి 88 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 62 వినతులు వచ్చాయి.



# ఆస్తుల పరిరక్షణకు కమిటీ ఏర్పాటు

**టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**



తిరుమల, (విశాఖ సమాచారమ్): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శాశ్వత ఉద్యోగులకు మూడు నెలలకు ఒకసారి సుపథం దర్శనం కల్పిస్తామని ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. సుపథం టికెట్ ఇచ్చి శ్రీవారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. తిరుమలలో లైసెన్స్ లేని దుకాణాలను ఖాళీ చేయిస్తామని తెలిపారు. టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం అనంతరం ఈవో శ్యామల రావుతో కలిసి బీఆర్ నాయుడు సోమవారం మీడియాతో మాట్లాడారు. బోర్డు తీర్మానాలను వివరించారు.

**బోర్డు తీర్మానాలు ఇవీ..**

• ఇతర దేశాల్లో ఆలయాల నిర్మాణాల కోసం ప్రత్యేక ట్రస్ట్ • టీడీడీ ఆస్తులు పరిరక్షించేందుకు కమిటీ ఏర్పాటు • టీడీడీ భూముల న్యాయపరమైన వివాదాలపై పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు • టీడీడీలో విధులు నిర్వహిస్తున్న హిందూయేతర ఉద్యోగుల తొలగింపుపై తీర్మానం. • వచ్చే ఏడాది కాలంలో వివిధ రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక చర్యలు • గ్రామాల్లో అర్ధాంత రంగా ఆగిన ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సాయం • శ్రీనివాస సేవా సమితి పేరుతో స్వామి వారికి కైంకర్యాల సామగ్రి సరఫరాలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశం • టీడీడీ మూలాలున్న వివిధ ప్రాంతాల్లోని ఆలయాల పునరుద్ధరణకు తీర్మానం • తిరుమలలో అనధికార హాకర్లు తొలగింపునకు విజిలెన్స్, రెవెన్యూ అధికారులతో కమిటీ • వృద్ధులు, దివ్యాంగులకు ఆఫ్‌లైన్‌లో దర్శన టికెట్లు కేటాయింపు. ప్రయోగాత్మకంగా పూర్వ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయం • రూ.5,258.68 కోట్లతో టీడీడీ 2025-26 బడ్జెట్‌కు ఆమోదం • రూ.772 కోట్లతో గదుల ఆధునీకీకరణకు నిర్ణయం

# టారిఫ్‌ల ఆందోళన వేళ..

**భారత్‌కు అమెరికా వాణిజ్య ప్రతినిధి**



దిల్లీ: అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ మార్చి 25 నుంచి 29వ తేదీ వరకు భారత్‌లో పర్యటించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. భారత్ అధిక సుంకాలు విధిస్తోందని, ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు తప్పవంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. ఇతర దేశాలతో ట్రంప్ వాణిజ్య యుద్ధాలను కొనసాగిస్తున్న వేళ ఆ దేశానికి చెందిన వాణిజ్య ప్రతినిధి భారత్‌లో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దక్షిణ, మధ్య ఆసియాకు అమెరికా సహాయ వాణిజ్య ప్రతినిధిగా ఉన్న బ్రెండన్ లించ్, యూఎస్ అధికారుల బృందంతో కలిసి వచ్చే నెలలో భారత్ రానున్నారని..ఐదు రోజుల పర్యటనలో భాగంగా ఇరుదేశాల మధ్య వాణిజ్యం, సుంకాల అమలు మొదలైన విషయాల గురించి వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సహా ఇతర భారత అధికారులతో చర్చలు జరపనున్నారని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. లెవీలు, మార్కెట్ యాక్సెస్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించే పలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల గురించి కూడా మాట్లాడుకోనున్నట్లు వెల్లడించాయి.

భారతదేశంతో పెట్టుబడి, వాణిజ్య సంబంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి నిబద్ధతతో ఉన్నామని..త్వరలో భారత అధికారులతో చర్చలు జరపడానికి ఎదురు చూస్తున్నామని బ్రెండన్ లించ్ పేర్కొన్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ట్రంప్ సుంకాల విధింపునకు మరికొద్ది రోజులే గడువున్న నేపథ్యంలో సుంకాలు సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నామని భారత్ పేర్కొంది. ఇరువురికీ ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం కోసం ఓ ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనకు అమెరికాతో సంప్రదింపులు చేస్తున్నామని తెలిపింది. "పరస్పరం ప్రయోజనం చేకూరే వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా యంత్రాంగంతో వివిధ స్థాయిల్లో సంప్రదింపులు జరుపుతున్నాం. వీటిని ముందుకు తీసుకెళ్లే ప్రక్రియలో ఇరు దేశాలు నిమగ్నమై ఉన్నాయి. వాణిజ్యాన్ని విస్తరించడం, మార్కెట్ యాక్సెస్, సుంకాల తగ్గింపు, సప్లై-చైన్ సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఇవి కొనసాగుతున్నాయి" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు.

# రన్‌వేపై అదుపుతప్పిన విమానం

**శిమ్లాలో త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం**

శిమ్లా: శిమ్లా ఎయిర్ పోర్టులో ఓ భారీ విమాన ప్రమదం త్రుటిలో తప్పింది. అలయన్స్ ఎయిర్ ఫ్లయిట్ నెంబర్ 91821 నేడు రన్‌వే నుంచి అదుపు తప్పి దూసుకెళ్లింది. ఈ విమానంలో హిమాచల్ ప్రదేశ్ డిప్యూటీ సీఎం ముఖేశ్ అగ్నిహోత్రీ, రాష్ట్ర డీజీపీ అతుల్ వర్మ సహా 44 మంది ప్రయాణికులు ఉన్నారు. దిల్లీ నుంచి బయల్దేరి శిమ్లాలో ల్యాండిరగ్ చేసే సమయంలో విమానం బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో పైలట్ విషయాన్ని ప్రయాణికులకు తెలియజేసి.. ఎమర్జెన్సీ బ్రేకులు వేసేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ప్రయాణికులు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనలకు లోనయ్యారు. ఈ ప్రమాదంపై అలయన్స్ ఎయిర్ ఇప్పటి వరకు స్పందించలేదు. ఈ విమానం దిల్లీ-శిమ్లా-ధర్మశాల-దిల్లీ మధ్య ప్రయాణిస్తుంటుంది. "ఈ ఉదయం మేము విమానంలో శిమ్లా చేరుకొన్నాం. ల్యాండిరగ్ సమయంలో కొన్ని సమస్యలు ఎదురయ్యాయి. సాంకేతిక అంశాలు నాకు తెలియదు. కానీ, విమానం ఎక్కడ దిగాలో అక్కడ ల్యాండ్ కాలేదు.. ఆగాల్సిన చోట ఆగలేదు. రన్‌వే చివరికి దూసుకెళ్లి ఆగింది. వేగాన్ని తగ్గించేందుకు శక్తిమంతమైన బ్రేకులు వేయాల్సి వచ్చింది. ఆ తర్వాత మరో 25 నిమిషాలపాటు విమానంలోనే ఉండిపోవాల్సి వచ్చింది" అని హిమాచల్ ప్రదేశ్ డిప్యూటీ సీఎం అగ్నిహోత్రి తెలిపారు.

# చందనోత్సవం నాటికి ప్రసాద్ స్కీం పనులు పూర్తి

**- సింహాచలం అధికారులకు మంత్రి కందుల దుర్గేష్ ఆదేశం**

**అప్పన్నను దర్శించుకున్న మంత్రి**



సింహాచలం, (విశాఖ సమాచారమ్): రాష్ట్రంలో ప్రసిద్ధి పొందిన నవనారసింహ క్షేత్రాల్లో ఒకట్కైన సింహాచల శ్రీ వరాహ స్వామి అధ్యాత్మిక క్షేత్రాన్ని కూటమి ప్రభుత్వం మరింత అభివృద్ధి చేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం విశాఖ పర్యటనలో భాగంగా మంత్రి సింహాచలం క్షేత్రాన్ని సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం ద్వారా చేపడుతున్న ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏపీ పర్యాటకాభివృద్ధికి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నుండి మంచి సపోర్ట్ ఉందని తెలుపుతూ పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడవద్దని కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. సకాలంలో ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ చివర్లో జరిగే చందనోత్సవం కార్యక్రమానికి క్యూ లైన్ పనులు, టాయిలెట్స్, బాత్ రూమ్స్ తదితర పనులు పూర్తి చేయగలిగితే భక్తుల తాకిడిని నియంత్రించవచ్చన్నారు. గతంలో సింహాచలం దర్శనానికి వచ్చే భక్తులు కేవలం దర్శనం మాత్రమే చూసుకొని వెనుదిరిగేవారన్నారు. చుట్టు ప్రక్కల ప్రాంతాలను చూసేందుకు అవసరమైన వసతులు ఉండేవి కావన్నారు. ప్రస్తుతం సింహాచలంకు వచ్చే భక్తులు దర్శనంతో పాటు నాలుగైదు రోజులు ఉండి చుట్టు ప్రక్కల ప్రదేశాలను చూసే విధంగా టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసి హెూటల్స్, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. విశాఖలో బీచ్, అడ్వెంచర్, ఎకో, క్రూయిజ్ టూరిజం ప్రక్రియలను పర్యాటకులు అనుభవించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లంబసింగిలో మంచి రిసార్ట్స్ లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. బొర్రా గుహలను మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రసాద్ స్కీం క్రింద అన్నవరం పుణ్యక్షేత్రంలో కూడా పనులు జరుగుతున్నాయని మంత్రి దుర్గేష్ వివరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.99 కోట్లతో అఖండ గోదావరి, రూ.77 కోట్లతో గండికోట ప్రాజెక్టులను చేపట్టామన్నారు.

# బీచ్ పర్యాటకానికి మరింత ఊతం

(మొదటి పేజీ తరువాయి)

ఉండేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో ప్రత్యేక కార్యచరణ ఏర్పాటు చేసుకున్నామన్నారు. బీచ్ లను పరిశుభ్రంగా ఉంచాల్సిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. బ్లూఫ్లాగ్ బీచ్ పదికాలాల పాటు నిలబడాలన్నా, పర్యాటకులను విశేషంగా ఆకర్షించాలన్నా ప్రజలు, స్థానికుల భాగస్వామ్యం చాలా అవసరమని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ ను డెన్మార్క్ కు సంబంధించిన సంస్థ తాత్కాలికంగా మాత్రమే ఉపసంహరించిందనే విషయాన్ని గుర్తుచేశారు. పూర్తిగా రద్దుచేస్తామని సంబంధిత నిర్వాహకులు ఎక్కడా చెప్పలేదన్నారు. తాత్కాలిక ఉపసంహరణ ద్వారా నిర్వహణ సామర్థ్యం పెంచుకునే బాధ్యతను గుర్తుచేసిందన్నారు. ఈ క్రమంలో విశాఖ రుషికొండ బీచ్ కి బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ పునరుద్ధరణ జరిగిందన్నారు. రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టులు తీసుకురావడం సులభమే కానీ వాటి సమర్ధ నిర్వహణకు సమైక్యంగా పనిచేయాల్సిన అవసరముందని మంత్రి అభిప్రాయపడ్డారు. బీచ్ ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా చెత్తవేయకూడదని, సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలు సహా ఏది పడితే అది విసిరివేయకూడదని, నీటిని కలుషితం చేయకూడదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పర్యాటకులకు, ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.

**పర్యాటక శాఖపై ప్రత్యేక శ్రద్ధ**

రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక శాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించిందని తెలుపుతూ కొత్త పర్యాటక పాలసీని తీసుకొచ్చామని, పర్యాటక రంగానికి పరిశ్రమహెూదా కల్పించామని గుర్తుచేశారు. ప్రత్యేకించి విశాఖపట్నంలోని పర్యాటక శాఖ అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేసి పర్యాటకాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ క్రమంలో బాంబూ పాసింగ్ పేస్ లాంటివి ఏర్పాటు చేద్దామన్నారు. బీర్, వైన్ వంటివి అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షిస్తామన్నారు. తద్వారా పర్యాటకాభివృద్ధితో పాటు ఆర్థికంగా కూడా బలోపేతం అయ్యేందుకు అవకాశముంటుందన్నారు.

**రుషికొండ బీచ్ ప్రత్యేకత**

రాష్ట్రంలోని 974 కి.మీల సుదీర్ఘ సముద్ర తీరంలో ఉన్న ఎన్నో బీచ్ ల్లో విశాఖలోని రుషికొండ బీచ్ కు ఒక ప్రత్యేకత ఉందని తెలిపారు. సహజ సిద్ధ అందాలు, చుట్టూ ఉన్న ప్రకృతి సంపద, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ జ్ఞానాన్ని అందించేలా బ్లూఫ్లాగ్ బీచ్ తయారుకావాలన్నారు. బీచ్ లో అంతర్జాతీయ ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్థానికంగా ఉపాధి పొందుతున్న మత్స్యకారుల జీవితాలు ఇబ్బంది పడకుండా చూసే బాధ్యత తమదన్నారు. నిబంధనల ప్రకారం ఎన్ని కార్యక్రమాలు చేసినా ప్రజాప్రతినిధులుగా మానవీయ కోణం ఆవిష్కరించే బాధ్యత తమకు ఉంటుందన్నారు. ఇక్కడ భూములు అన్యాక్రాంతం అయితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అంతిమంగా రుషికొండలో బ్లూఫాగ్ బీచ్ రెపరెపలాడేలా చేశామన్నారు. అనంతరం మంత్రి దుర్గేష్ పలువురికి లైఫ్ జాకెట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏపీటీడీసీ ఛైర్మన్ డా.నూకసాని బాలాజీ, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, పర్యాటక శాఖ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్యాంపు రాజకీయం షురూ!

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు వ్యూహాలకు పదును పెట్టింది. పట్టు సడలకుండా జీవీఎంసీలోని వైసీపీ కార్పొరేటర్లందరినీ బెంగళూరుకు తరలిస్తోంది. మేయర్‌పై అవిశ్వాసం రోజు మళ్లీ తిరిగి విశాఖకు రానున్నారు. కాగా విశాఖ మేయర్ పీఠంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. గత ఎన్నికల్లో 98 డివిజన్లలో 59 మంది కార్పొరేటర్లు వైసీపీ నుంచి జయకేతనం ఎగరవేశారు. మిగిలిన స్థానాలను టీడీపీ, జనసేన పార్టీలు గెలుచుకున్నాయి. అయితే రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల తర్వాత విశాఖలో సీన్ మొత్తం మారిపోయింది. 25 మంది కార్పొరేటర్లు కూటమి పార్టీలవైపు చేరిపోయారు. దీంతో ఎమ్మెల్సీ బొత్స

# విశాఖ అమ్మాయి.. తొలియత్నంలోనే గ్రూప్-1లో విజయం

(మొదటి పేజీ తరువాయి)

మందితో నిర్వహించిన నృత్య పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 2011లో గిన్నిస్ బుక్ రికార్డును కైవసం చేసుకున్నారు. 2012లో కూచిపూడిలో డిప్లమా సాధించారు. 2013లో తండ్రి మరణించడంతో తల్లి వెంకటలక్ష్మి ఇంటి బాధ్యతలు భుజాన వేసుకున్నారు. ఇద్దరు కూతుళ్ల విద్యాభ్యాసంపై దృష్టిపె ట్టారు. తల్లి ప్రోత్సాహంతో 2018లో ఎంఏ పూర్తిచేసిన భానోదయ సివిల్స్ సర్వీసెస్ కు శిక్షణ తీసుకున్నారు. తొలి ప్రయత్నంలోనే గ్రూప్-1 మెయిన్స్ పూర్తిచేశారు. రిజల్ట్ పెండిరగ్‌లో పడిరది. 2020లో హైదరాబాద్ లో నిర్మాణ రంగ వ్యాపారం చేస్తున్న రామ్‌మనోహర్‌తో పెళ్లయింది. 2022లో గ్రూప్-1 ఫలితాలు వచ్చాయి. భానోదయ విజయం సాధించారు. డీఎస్పీగా శిక్షణ పూర్తిచేసుకుని తొలుత గ్రేహౌండ్స్‌లో పనిచేశారు. ప్రస్తుతం గుంటూరు సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిసున్నారు. భానోదయ దంపతులకు మూడేళ్ల కూమార్తె జుషరిత ఉన్నారు. నా తల్లి వెంకట లక్ష్మి, నా భర్త రామ్మనోహర్ ప్రోత్సాహంతో ఈస్థాయికి వచ్చానని భానోదయ తెలిపారు.

# విద్యార్థి వీసాలకు అమెరికా కత్తెర

(మొదటి పేజీ తరువాయి)

ఎఫ్-1 వీసాల కోసం 6.79 లక్షల దరఖాస్తులు రాగా.. ఇందులో 2.79 లక్షల (దాదాపు 41శాతం) దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. అంతకుముందు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 6.99 లక్షల దరఖాస్తుల్లో 2.53 లక్షల (36శాతం) అప్లికేషన్లకు అధికారులు ఆమోదం తెలపలేదు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో 7.69 లక్షల మంది విద్యార్థి వీసాల కోసం దరఖాస్తు చేసుకోగా.. 1.73లక్షల (23శాతం) అప్లికేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నాటితో పోలిస్తే గతేడాది సంఖ్య దాదాపు రెట్టింపుగా ఉంది. అయితే, దేశాలవారీగా తిరస్కరణకు గురైన వారి సంఖ్యను అమెరికా వెల్లడిరచలేదు. కానీ, గతేడాది డిసెంబరు 9 నాటి వరకు ఉన్న గణాంకాల ప్రకారం.. 2024 సంవత్సరం తొలి 9 నెలల్లో భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలు 38శాతం తగ్గినట్లు తెలిసింది. కొవిడ్ తర్వాత భారతీయ విద్యార్థులకు వీసాలు ఈ స్థాయిలో తగ్గడం ఇదే తొలిసారి. బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ నెలవారీ నివేదికల డేటా ప్రకారం.. 2024 జనవరి నుంచి సెప్టెంబరు మధ్య 64 వేల మంది భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలను జారీ చేశారు. అంతకుముందు 2023 ఇదే సమయంలో ఈ సంఖ్య 1.03 లక్షలుగా ఉండటం గమనార్హం.

**ఎఫ్-1 వీసా అంటే ?**

ఎఫ్-1 వీసా అనేది నాన్-ఇమిగ్రెంట్ వీసా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు అమెరికాలో ఫుల్ టైమ్ విద్యను అభ్యసించేందుకు ఈ వీసా అనుమతినిస్తుంది. అగ్రరాజ్యంలోని విద్యా సంస్థలు ఏటా రెండుసార్లు ప్రవేశాలను అనుమతిస్తాయి. ఆగస్టు- డిసెంబర్ సెమిస్టర్ సమయంలోనే మన విద్యార్థులు అధికంగా వెళ్తుంటారు.

# ఐదేళ్లలో టోల్ ట్యాక్స్ వసూలు రూ. 1.93 లక్షల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఐదేళ్లలోఈ ప్లాజాలో రూ.1,884.46 కోట్ల విలువైన టోల్ వసూలు చేసినట్లు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ డేటా వెల్లడిరచింది. మూడవ స్థానంలో పశ్చిమ బెంగాల్‌లోని జల్దులగోరి టోల్ ప్లాజా ఉంది. 2019-20 నుండి 2023-24 వరకు ఐదు సంవత్సరాలలో ఇది రూ.1,538.91 కోట్ల టోల్ వసూలు చేసింది. ఉత్తరప్రదేశ్ లోని బారజోధ టోల్ ప్లాజా గత ఐదు సంవత్సరాలలో రూ.1,480.75 కోట్ల టోల్ వసూలు చేసి జాబితాలో 4వ స్థానంలో ఉంది. టాప్ 10 ఆదాయాన్ని ఆర్జించే టోల్ ప్లాజాల జాబితాలో రెండు ప్లాజాలు గుజరాత్‌లో, రెండు రాజస్థాన్‌లో రెండు ఉత్తర ప్రదేశ్‌లో ఉన్నాయి. హర్యానా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, బీహార్‌లలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. గత ఐదేళ్లలో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే 10 టోల్ ప్లాజాలు రూ. 13,988.51 కోట్ల విలువైన టోల్ వసూలు చేశాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మొత్తం 1,063 టోల్ ప్లాజాలు ఉన్నాయి. వీటిలో 457 టోల్ ప్లాజాలను గత ఐదేళ్లలో ఏర్పాటు చేశారు.

# పార్లమెంట్‌లో అరకు కాఫీ ఘుమఘుమలు






(మొదటి పేజీ తరువాయి)

జోయల్ ఓరం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు , ఏపీ గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి టిడిపి, బిజెపి ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరకు కాఫీ ఉత్పత్తులను లోక్ సభ స్పీకర్ కు మంత్రి సంధ్యారాణి అందజేశారు. ఈ నెల 28 వరకు స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించారు.

**చంద్రబాబు ధన్యవాదాలు**

అమరావతి: అరకు కాఫీ గురించి మన్ కీ బాత్‌లో ప్రస్తావించినందుకు ప్రధాని మోదీ కి, పార్లమెంట్‌లో కాఫీ స్టాల్ ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఏపీ ముఖ్య మంత్రి చంద్రబాబు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మైలురాయిని నిజం చేసిన ప్రతి ఒక్కరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ప్రాంగణంలో కాఫీ స్టాళ్లను ఏర్పాటు చేసిన సందర్భంగా 'ఎక్స్' వేదికగా చంద్రబాబు స్పందించారు.

"ఇది మనందరికీ, ముఖ్యంగా మన గిరిజన రైతులకు గర్వకారణం. వారి అంకిత భావం, కృషి.. అరకు కాఫీని జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. ప్రతి కప్పును ఆస్వాదిస్తుంటే.. వారి స్ఫూర్తిదాయక ప్రయాణం గుర్తుకురావాలి" అని అన్నారు. పార్లమెంట్‌లో మన అరకు కాఫీ స్టాను ప్రారంభించేందుకు ప్రోత్సహించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ సందర్భంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కృతజ్ఞతలు చెప్పారు.

# జస్టిస్ యశ్వంత్‌వర్మ విధులకు దూరం

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు తీసిన వీడియోలో కాలిన నోట్ల కట్టలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ వీడియోను పోలీస్ కమిషనర్ దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయకు సమర్పించగా.. ఆయన దానిని తన నివేదికలో పొందుపరిచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు అందించారు. దీనిపై సుప్రీంకోర్టు అసాధారణ నిర్ణయం తీసుకుంది. శనివారం రాత్రి నివేదిక మొత్తాన్ని ఫొటోలు, వీడియోలతో సహా తన వెబ్‌సైట్‌లో పెట్టింది. వెబ్‌సైట్‌లో పెట్టిన ఆ వీడియోలో కాలిన నోట్ల కట్టలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. శనివారమే ఈ వ్యవహారంపై ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని సీజేఐ ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఆ కమిటీ విచారణ సాధ్యమైనంత త్వరలో ప్రారంభం కానుంది. అయితే ఈ కమిటీకి నిర్ణీత గడువేమీ విధించలేదు. జస్టిస్ వర్మ మాత్రం ఈ ఆరోపణలను ఖండిరచారు. దిల్లీ హైకోర్టు సీజేకు ఇచ్చిన సమాధానంలో ఆయన ఈమేరకు స్పష్టం చేశారు. తాను గానీ, తన బంధువులు గానీ ఎటువంటి నోట్ల కట్టలను గదిలో ఉంచలేదని తెలిపారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు జరిగిన కుట్రగా దీనిని పేర్కొన్నారు. తమ నగదు ఉపసంహరణలు బ్యాంకుల ద్వారానే జరుగుతాయని, తాము యూపీఐ యాప్‌లను వాడతామని, కార్డులతో లావాదేవీలు జరుపుతామని వివరించారు. తాము ఆ గదిని.. సాధారణంగా ఉపయోగంలో లేని ఫర్నిచర్, సీసాలు, క్రాకరీ, పరుపులు, కార్పెట్లు, పాత స్పీకర్లు, గార్డెన్ వస్తువులను ఉంచడానికి వాడతామని తెలిపారు. జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలను సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ మార్కండేయ కట్జు తోసిపుచ్చారు. మూడు తరాలుగా ఆయన కుటుంబం గురించి తనకు తెలుసని పేర్కొన్నారు.

## విశాఖ రైల్వే డీఆర్ఎం లలిత్ బొహ్రాతో జీవీఎల్ భేటీ

### నూతన రైల్వే జోన్ నిర్మాణం పై వాకబు




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- బిజెపి మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన విశాఖ డిఆర్ఎం లలిత్ బోహ్రా ను సోమవారం కలిసి అభినందించారు..ఈ సందర్భంగా

విశాఖ రైల్వే జోన్ భవన నిర్మాణ తీరు పై వాకబు చేసారు. జీవీఎల్ ఆధ్వర్యంలో రాజస్థాన్, బీహార్, మరియు హర్యానాలకు చెందిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు కలిసి రైల్వేకి సంబంధించిన అనేక సమస్యలను డిఆర్ఎంకు తెలియ చేశారు.

గతంలో విశాఖ నుండి కాశీకి ప్రత్యేక రైలును ఏర్పాటు చేయించిన విషయాన్ని గుర్తు చేస్తూ ప్రస్తుతం విశాఖ నుండి గయా రైలును రెగ్యులర్ చేయాలని, తద్వారా గయలో పితృదేవతలకు పిండ ప్రదానాలు చేయుటకు అధిక సంఖ్యలో వెళ్లే తెలుగు రాష్ట్రాల ప్రజలకు, మరియు విశాఖ నుండి వారి స్వస్థలాలకు వెళ్లే ఇతర రాష్ట్రాల ప్రజలకు ఇది అత్యంత ఉపయుక్తంగా ఉంటుందని జీవీఎల్ డిఆర్ఎం కు తెలియజేశారు.

## తక్కువ పెట్టుబడి తో ఎక్కువ లాభం అనే మాయలో పడకండి

### క్రికెట్ బెట్టింగ్‌కు దూరంగా ఉండండి - జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచన



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- ఐపీఎల్, టి20 క్రికెట్ మ్యాచ్‌లను ఆసరాగా తీసుకొని, అమాయక ప్రజలను మోసగించేందుకు క్రికెట్ బెట్టింగ్ ముఠాలు యాక్టివ్‌గా పనిచేస్తున్నాయన్నారు. "తక్కువ పెట్టుబడి పెట్టి, ఎక్కువ లాభాలు సాధించవచ్చు" అనే ఆశ చూపిస్తూ ఈ ముఠాలు ఎందరో యువతను, సామాన్యులను ఆర్థికంగా నాశనం చేస్తున్నాయి. ఇటీవల క్రికెట్ బెట్టింగ్ యాప్స్ వల్ల, త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో అనేకమంది అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చట్ట విరుద్ధమైన ఈ బెట్టింగ్ యాప్స్ ప్రభావంతో కొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.అనకాపల్లి జిల్లా పోలీసులు ఇటువంటి క్రికెట్ బెట్టింగ్ ముఠాలను అణచివేసేందుకు ప్రజలు సహకరించాలని, సమాచారం స్థానిక పోలీసులకు గాని లేదా డయల్ 100/112 అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరించారు. ముందుగా చిన్న మొత్తంలో గెలిచేలా చేసి నమ్మకాన్ని పెంచుతారు. తర్వాత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహిస్తారు.

ఓడిపోయాక డబ్బు తిరిగి పొందేందుకు మరింత పెట్టుబడి పెట్టాలని మభ్యపెడతారు.

అప్పులు తీసుకునే స్థితికి వచ్చి, తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూసేవరకు వదలరు. పరిమితి దాటి అప్పులు పెరిగితే బెట్టింగ్ ముఠాలు, లోన్ యాప్ ప్రతినిధులు కుటుంబ సభ్యులను వేధిస్తారు. తీవ్ర ఒత్తిడితో కొందరు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితికి చేరుకుంటున్నారు.నకిలీ అకౌంట్లు, నకిలీ యూపీఐ లావాదేవీలు అసలు నిర్వాహకులు కనిపించరు. సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లను ఉపయోగించి ఆకర్షణీయమైన ప్రకటనలు చేస్తారు.ఇతరుల ఖాతాలను ఉపయోగించి డబ్బు మళ్లింపు చేయడం చట్టపరంగా నేరం.

చట్టవిరుద్ధమైన మార్గాల్లో నడుస్తున్న యాప్స్ వెనక పెద్ద ముఠాలు ఉన్నాయని గుర్తించాలన్నారు.ఎవరూ ఉచితంగా డబ్బు ఇవ్వరు కష్టపడి సంపాదించిందే నిజమైన సంపాదన,బెట్టింగ్‌లో పెట్టిన డబ్బు తిరిగి వచ్చే అవకాశం తక్కువన్నారు. ఓడిపోయినవారు మళ్లీ అదే తప్పు చేయకుండా ఉండలేరు, ఇది వ్యసనంగా మారుతుంది. ఆర్థిక నష్టమే కాదు, కుటుంబ పరువు పోయేలా బెట్టింగ్ ముఠాలు వేధిస్తాయి. కుటుంబ సభ్యులను ఒంటరిగా మారుస్తూ మరణం వైపు నడిపిస్తుంది."ఈజీ మనీ" మాయలో పడకండి శ్రమించిందే శాశ్వత సంపాదనన్నారు. అప్పుల కోసం అనాగరిక మార్గాలను ఆశ్రయించకండి చట్టబద్ధమైన మార్గాలను వినియోగించుకోండి.

సోషల్ మీడియా ప్రకటనలు నమ్మొద్దు అవి చాలా వరకు మోసపూరితమైన లింకులే, ప్రభుత్వ అనుమతి లేని బెట్టింగ్ యాప్స్ వాడడం నేరం, చట్ట ప్రకారం శిక్షార్హం. మీ పిల్లలు, స్నేహితులు బెట్టింగ్ వైపు మొగ్గు చూపితే వారికి అవగాహన కల్పించండి. నిజమైన సంపాదన మీ శ్రమ, నైపుణ్యం, తెలివితేటలపై ఆధారపడి ఉంటుందన్నారు. బెట్టింగ్ మాయలో పడకుండా, చట్టబద్ధమైన మార్గాల్లో జీవనం సాగించండి.

మీ కుటుంబాన్ని, భవిష్యత్తును కాపాడుకోవడానికి బెట్టింగ్ యాప్స్‌కు వీలైనంత దూరంగా ఉండి, మీ భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు.అనకాపల్లి జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌కు తావు లేదు. ప్రజలను మోసం చేసే వారిని ఉపేక్షించబోమని, క్రికెట్ బెట్టింగ్ నిర్వహించిన, ప్రోత్సహించిన వారిపై ఆంధ్రప్రదేశ్ జూద చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేసి వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. యువత ఈ మాయలో పడకుండా, తల్లిదండ్రుల ఆశలను నాశనం చేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

## నూకాంబిక జాతరకు విస్తృత ఏర్పాట్లు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- నగరంలోని పాత డైరీ ఫారం వెటర్నరీ కాలనీలో వెలసిన శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరిసర ప్రాంతాల గ్రామదేవతగా పూజలు అందుకుంటున్న అమ్మవారి జాతర వేడుకలు మంగళవారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కొత్తమావాస్య శనివారం అమ్మవారికి విశేష పూజలతో పాటు అత్యంత వైభవంగా జాతర నిర్వహించనున్నట్లు వారి పేర్కొన్నారు. కోలాటం, గరిడీ పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని అమ్మ కృపకు పాత్రులు కావాలని కమిటీ సభ్యులు కోరారు.

## అనకాపల్లి జిల్లా హ్యూమన్ రైట్స్ వైస్ ప్రెసిడెంట్‌గా ముప్పిన రామకృష్ణ



గొలుగొండ, (విశాఖ సమాచారమ్):- జిల్లా హ్యూమన్ రైట్స్ వైస్ ప్రెసిడెంట్ గా ముప్పిన రామకృష్ణ నియమితులైనట్లు మదిరే రంగ సాయి రెడ్డి తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన సమావేశంలో అనకాపల్లి జిల్లాకు హ్యూమన్ రైట్స్ బోర్డు సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ గా రామకృష్ణను నియమించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయనకు ధ్రువపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తనకు అప్ప చెప్పిన బాధ్యతను శక్తివంచన లేకుండా కృషిచేసి నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్కు నరసింహమూర్తి,షేక్ జిలాని, ఉల్లి తలుపులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌కు వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- వీఎంఆర్డీఏ ప్రజాదర్బార్ కు వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని చైర్ పర్సన్ ఎం. వి .ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటిన్ కమిషనర్ విశ్వనాధన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం

వి ఎం ఆర్ డి ఎ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కి విశేష స్పందన లభించింది. చైర్ పర్సన్, కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా దర్బార్ కు వచ్చిన ఫిర్యాదులు, వినతులు గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరగకుండా బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. బాధితుల సమస్యలు స్వయంగా విని ఆయా అంశాలపై సంబంధిత అధికారులకి పలు సూచనలు చేశారు. భూముల వ్యవరాలను మరింత లోతుగా అధ్యయనం చేసి, బాధితులకు సరైన వివరణ ఇవ్వాలని సూచించారు. సోమవారం ప్రజా దర్బార్ కి మొత్తం ఫిర్యాదులు- వచ్చాయి. వీటిలో - పరిపాలన - , ప్లానింగ్ - ,ఎస్టేట్ - విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి. సమావేశంలో కార్యదర్శి మురళీకృష్ణ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## భీమిలి - దొరతోట 200 అడుగుల రోడ్డును వ్యతిరేకిస్తూ ఆందోళన




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- విశాఖ మెట్రో ప్రాంత డెవలప్మెంట్ అథారిటీ( వి ఎం ఆర్ డి ఏ) ఇటీవల భీమిలి నుండి దోరతోట వై జంక్షన్ వరకు ప్రస్తుత రోడ్డు ను 200 అడుగులుగా మారుస్తూ ప్రతిపాదన చేస్తూ ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ సోమవారం వివెంఆర్డిఏ కార్యాలయం ఎదుట బాధిత గ్రామ ప్రజలు, గృహ యజమానులు, ఫ్లాట్ ఓనర్లు, చిన్న చిన్న దుకాన దారులు నిరసన తెలియజేసారు. అనంతరం వి ఎం ఆర్ డి ఏ కమిషనర్, చైర్మన్ లకు వ్రాత పూర్వక మెమొరాండం ఇచ్చారు.

ఈ సందర్భంగా జీవి ఎం సీ సిపిఎం ఫ్లోర్ లీడర్, 78 వ వార్డు కార్పొరేటర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం వెంటనే భీమిలి నుండి డొరతోట వై జంక్షన్ రోడ్డు ను 200 అడుగులుగా మార్చే ప్రతి పాదనను ఉపసంహరించాలని కోరారు. గతంలో ఈ రోడ్డు 60 ఎడుగులుగా ప్రతి పాదించారని కానీ రోడ్డు మాత్రం విస్తరణ చేయలేదు. ఆతరువాత 80 అడుగులకు, ఆతరువాత 100 అడుగులకు మార్చారు. కానీ ఆచరణలో రోడ్డు మాత్రం వేయలేదని అన్నారు. కేవలం రియల్ ఎస్టేట్ ల ప్రయోజనాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఈ రోడ్ల విస్తరణ చేపట్టిందని విమర్శించారు.

ఇప్పుడు విశాఖ నగరం చుట్టూ 15 రోడ్లను విస్తరణకు విఎం ఆర్ డి ఏ చేపట్టిందని, ఇవన్నీ ప్రజల ప్రయోజనాల కన్నా రియల్ ఎస్టేట్ సంస్థల కోసమే చేపట్టారని దుయ్యబట్టారు.

రోడ్డు విస్తరణలో ఇల్లు, నివాస ఫ్లాట్స్, భూములు కోల్పోయే వారికి మార్కెట్ రేటు ప్రకారం 4 రెట్లు నష్ట పరిహారం లేదా దీనికి సమానమైన భూమిని నష్ట పరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే బొద్దపాలెం, ఇతర గ్రామాల్లో దుకాణాలు కోల్పోతున్న వారికి రోడ్డు ప్రక్కనే భూమి కేటాయించి వారి జీవనోపాధిని పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. వెంటనే భీమిలి ఎం ఎల్ ఏ గంటా శ్రీనివాసరావు స్పందించి రోడ్డు విస్తరణను నిలుపుదలచేసి ప్రజలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్య క్రమం లో సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ ఎస్ ఎన్ మూర్తి, నాయకులు అప్పల నాయుడు, సూర్యనారాయణ, బోడపాలెం గ్రామ ప్రజలు, ఫ్లాట్ , భూయజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫారం పాండు పనులు ప్రారంభం



జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- జి మాడుగుల మండలం వంతల పంచాయితీ లోని జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే పారంపండ్ నుండి చేపట్టనున్న పారం స్థానిక ఎంపీటీసీ & ఎంపీపీ వి కళ్యాణి,చేతుల మీదుగా ప్రారంబించడం. జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెమ్మెలి పద్మ వైస్ సర్పంచ్ పి,తిరుపతమ్మ ,మాజీ సర్పంచ్ జి ,కొండబాబు,పైసా కార్యదర్శి పి,మహేష్ వార్డు మెంబర్ జి ,చిన్న, రాజులమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

## వర్గీకరణ పై విజయోత్సవ సభ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- గత 40 సంవత్సరాల నుండి ఆతృతగా ఎదురు చూస్తున్న ఎస్సీ ఉప వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడంతో గ్లోబల్ ఇంఫామ్ మ్యాక్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రిజర్వేషన్ ల విజయోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు హాజరై ఈ విద్యా సంవత్సరం నుండే రిజర్వేషన్లు అమలులో కి వస్తాయన్నారు. ఈ సమావేశంలో

జీమ్యాక్ రాష్ట్ర ప్రెసిడెంట్ కాకుమాను రాజ శిఖామణి, జాతీయ కన్వీనర్ డా.తెన్నేటి జయరాజు, మాజీ కార్పొరేటర్స్ కొప్పుల వెంకట్రావు, కొట్రా కన్నారావు, , కాకర రమణ, ప్రశాంత్ కుమార్, డా.కరసాల శ్రీనివాసరావు, డా.సామ్యూల్ జాన్, డా.రవి రత్న ప్రకాష్, డా.సి.హెచ్. ఆషా కిరణ్, సుధీర్, వులంపర్తి సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఫుడ్ సాంకేతిక నిపుణుల సామర్థ్యం పెంపుపై శిక్షణ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- మైక్రోబయాలజీ, కెమికల్ టెస్టింగ్,గోయి నోటిఫికేషన్, జీఎంపీ, ఎస్ఎస్ఓపీ, హెచ్ఏసీసీపీ, ఇంపోర్టింగ్ కంట్రీస్ ఆవశ్యకత అనే అంశంపై ఐదు రోజుల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ ను ఈఎల్‌పీ-చెన్నై, సబ్ ఆఫీస్: విశాఖపట్నం ఈఐసీ సహకారంతో ప్రారంభించారు.

ముఖ్య అతిథిగా ఐసీఏఆర్-సిఐఎఫ్‌టి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బి.మధుసూదనరావు, జయపాలన్ జి, డిప్యూటీ డైరెక్టర్ ఇన్ ఛార్జి సుధాంసు శేఖర్ దాస్ ఇతర అధికారులు, సమక్షంలో సోమవారం ప్రారంభించారు. విశాఖపట్నం, కాకినాడ, భీమవరం రీజియన్లలోని వివిధ అనుమతి పొందిన సీఫుడ్ సంస్థల సాంకేతిక నిపుణుల పాల్గొన్నారు.

## 27న ఎంపీపీ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం

### ప్రత్యేక అధికారి ఏ విద్యాసాగర్

జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- అల్లూరి సీతారామ జిల్లా మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి ఎన్నిక కోసం 27వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రొసీడింగ్ అధికారి ఏ విద్యాసాగర్ ప్రకటనలో తెలిపారు. 27వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఈ సమావేశంనిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి గౌరవ ఎంపిటిసి సభ్యులు మరియు కోఆప్షన్ సభ్యులు ఇదిగా హాజరుకావాలని ఆయన కోరారు.

## బలభద్రపురంలో క్యాన్సర్ నిర్ధరణ పరీక్షలు



బిక్కవోలు, (విశాఖ సమాచారమ్):- తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురాన్ని క్యాన్సర్ వణికిస్తోంది. దీంతో ఆ గ్రామంలో క్యాన్సర్ నిర్ధరణ పరీక్షలు కొనసాగుతున్నాయి. జీఎస్ఎల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందం ఈ పరీక్షలు నిర్వహిస్తోంది. విశాఖ హోమి బాబా క్యాన్సర్ పరిశోధన కేంద్రం నుంచి అంకాలజీ వైద్య నిపుణులు హాజరయ్యారు. ఇప్పటికే 26 తాగునీటి నమూనాలను అధికారులు సేకరించారు.

ఈ ప్రాంతంలో క్యాన్సర్ మహమ్మారి రెండేళ్లుగా వేగంగా విస్తరిస్తూ ప్రజల ప్రాణాలు హరిస్తోంది. సుమారు 14 వేల జనాభా ఉండే ఈ గ్రామంలో ఏ వీధిలోకి వెళ్లినా ఈ వ్యాధి బాధితులు కనిపిస్తున్నారు. కొన్ని కుటుంబాల్లో ఒకరి కంటే ఎక్కువ క్యాన్సర్ రోగులు ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

## క్యాన్సర్ కేసులపై బలబద్రపురంలో జల్లెడ



అనపర్తి, (విశాఖ సమాచారమ్):- అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలంలో క్యాన్సర్ కేసులపై జిల్లా వైద్య శాఖ జల్లెడ పట్టారు.

సోమవారం బలభద్రపురం సచివాలయం 3 లో పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్నా కలక్టర్ పి ప్రశాంతి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తూర్పు గోదావరి జిల్లా అనపర్తి శాసన సభ్యులు నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి 20.03.2025 న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో క్యాన్సర్ కేసుల పెరుగుదలపై లేవనెత్తిన సమస్యకు స్పందిస్తూ జిల్లా ఆధికార యంత్రాంగం మరియు వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా తక్షణ చర్యలలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జాతీయ సగటు రేటు కంటే తక్కువగా ఇక్కడ కేసులు నమోదయ్యాయి అని పేర్కొన్నారు.

22.03.2025 న రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం, 22.03.2025, 23.03.2025 తేదీలలో గ్రామంలో సర్వే నిర్వహించబడిందన్నారు.

ఇందులో 31 వైద్య బృందాలు, బృందంలో 17 వైద్యాధికారులుతో 31 బృందాలు గా ఏర్పడి (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎం ఎల్ ఎచ్), ఎ ఎన్ ఎం లు, ఆశా కార్యకర్తలు) గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి, ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను నమోదు చేశారు. కాన్సర్ నిపుణులు మరియు సోషల్, ప్రీవెంటివ్ మెడిసిన్( ఎస్ పి ఎం) నిపుణులు ఇచ్చిన ఫార్మాట్ ప్రకారం వారి ఆరోగ్య వివరాలను పరిశీలించి, డేటాను ధృవీకరించడం జరిగిందన్నారు.

**క్షేత్ర స్థాయిలో నిర్వహించిన సర్వే వివరాలు:**

ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 23 నమోదు కాగా, వీరిలో 15 మంది గ్రామంలోనే నివసిస్తూ చికిత్స పొందుతున్నారు. మరో 8 మంది వేరే ప్రాంతములలో నివసిస్తూ చికిత్స పొందుచున్నారని తెలిపారు.

ఇంటింటి సర్వే లో 32 మంది గతంలో క్యాన్సర్ నిర్ధారణ అయిన రోగులు గుర్తించబడ్డారు, వీరిలో 15 మందికి వైద్యచికిత్స పూర్తి కాగా, మరో 17 మందికి చికిత్స అందుతుందన్నారు.

మరియు ఇంటింటి సర్వే లో 38 మంది కాన్సర్ అనుమానిత కేసులను గుర్తించటం జరిగినది. వీరికి తదుపరి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా, 10 మందికి చెందిన వివరాలు రావడం జరిగిందనీ, వారికీ క్యాన్సర్ లేదని నిర్ధారణ అయిందనీ, మిగిలిన వాటికి చెందినవి కూడా ఇదే ఫలితాలు వస్తయన్న ఆశాభావాన్ని కలక్టర్ ప్రశాంతి వ్యక్తం చేశారు.

హెూమి బాబా కాన్సర్ ఇన్స్టిట్యూట్, జి ఎస్ ఎల్ మెడికల్ కాలేజ్ తగిన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

**క్యాన్సర్ స్క్రీనింగ్, వైద్య సహాయం:**

గ్రామంలో సోషల్, ప్రీవెన్టివ్ మెడిసిన్ డిపార్ట్మెంట్ వారు మరియు హెూమి బాబా కాన్సర్ ఇన్స్టిట్యూట్, విశాఖ పట్నం నిపుణులు సందర్శించి గ్రామ ప్రజలకు క్యాన్సర్ పై అవగాహన కల్పించి, వారి యొక్క సందేహాలను నివృత్తి చేయడం జరిగినదన్నారు.

జాతీయ సగటు ప్రకారం ప్రతి 10000 ల జనాభాకు 30 కాన్సర్ కేసులు గా ఉండటం సాధారణమే నని గణాంకాలు ద్వారా తెలుస్తుంది. అయితే ప్రస్తుతం గ్రామం లో 17 మంది కాన్సర్ చికిత్స తీసుకుంటున్నారు. సర్వేలో ఇప్పటి వరకు 38 కాన్సర్ అనుమానిత కేసులు గుర్తించడం జరిగినది వీరికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించవలిసి వుందన్నారు.

రానున్న మూడు రోజులు క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సు ద్వారా అనుమానిత కేసు లకు ప్రాధమిక పరీక్షలు నిర్వహించి తదుపరి నిర్ధారణ పరీక్షల నిమిత్తం ఉన్నత ఆసుపత్రులకు పంపించడం జరుగుతుందన్నారు ..తదుపరి శాసన సభ్యులు సూచనల మేరకు ఇంటింటి రక్త నమూనాను సేకరించి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో తృతీయ స్థాయిలో ప్రామాణిక ఆపరేటింగ్ విధానం ప్రకారం నిర్ధారణ నతర్వాత ఏదైనా అనుమానాస్పద కేసులు సానుకూలంగా మారితే ప్రభుత్వ ఆసుపత్రులు మరియు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ఎంప్యానెల్డ్ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్న చికిత్సా విధానంపై ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొనరు.

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర అసెంబ్లీ లో లేవనెత్తిన సమస్య విషయమై రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి క్షేత్ర స్థాయిలో ఇంటింటి సర్వే చేపట్టడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చెయ్యాలని కోరడం జరిగిందనీ, ఆమేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు కూడా సహకరించి పరీక్షలు నిర్వహించేందుకు ముందుకు రావాలని కోరారు.

ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు, డా ఎన్టీఆర్ ఆరోగ్య సేవా కోఆర్డినేటర్ ప్రియాంక , డా రాజీవ్, జిజిహెచ్ అసిస్టంట్ ప్రొఫెసర్ డా. ఎస్. ప్రశాంత్, రంగరాయ వైద్య కళాశాల హెచ్ వో డి డా.పీ . సుజాత స్టేట్ నోడల్ అధికారి (ఎన్సీడిసిడి) డా కె శ్యామల, కన్సల్టెంట్ కే. రాజ్ కిరణ్, జి ఎస్ ఎల్ అంకాలాజీ డా దీపక్, సర్జికల్ డా తరుణ్, ఒమి బాబా కేన్సర్ ఇన్స్టిట్యూట్ వైద్యులు డా దోలా రోసా, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్
మంగళవారం 25-3-2025

## న్యాయ వ్యవస్థకూ అవినీతి మరక!

భారత దేశంలో అవినీతి మరక అంటని వ్యవస్థ అంటూ ఏదీలేదు. బడా రాజకీయ నాయకుల నుంచి చోటా నాయకుల వరకు, ప్రభుత్వ శాఖల్లో చిన్న ఉద్యోగి నుంచి ఉన్నతాధికారుల వరకు అధిక శాతం మంది 'పైసంపాదన'కు అలవాటుపడినవారే. మిగతా వ్యవస్థలు ఎలా ఉన్నా న్యాయ వ్యవస్థ నిఖార్సుగా ఉంటుందని ప్రజలు భావిస్తారు. అయితే న్యాయ వ్యవస్థలో కూడా అవినీతి చోటుచేసుకుంటోందన్న విమర్శలు ఇటీవలి కాలంలో ఎక్కువగా వినిపిస్తున్నాయి. న్యాయ వ్యవస్థకు రాజ్యాంగం కల్పించిన రక్షణ కారణంగా న్యాయమూర్తుల అవినీతి గురించి బహిరంగంగా మాట్లాడలేని పరిస్థితి ఉంది. తీర్పులు అనుకూలంగా రాని సందర్భాలలో కక్షిదారులు న్యాయమూర్తులకు దురుద్దేశాలు ఆపాదించకుండా రాజ్యాంగ నిర్మాతలు ఈ రక్షణలు కల్పించారు. న్యాయమూర్తులకు దురుద్దేశాలు ఆపాదించే వారిని కోర్టు ధిక్కరణ కింద శిక్షించే వెసులుబాటును న్యాయ వ్యవస్థకు రాజ్యాంగం కల్పించింది. హైకోర్టు న్యాయమూర్తి ఎవరైనా అవినీతికి పాల్పడ్డారని వెల్లడైనా సదరు న్యాయమూర్తిపై సుప్రీంకోర్టు కూడా నేరుగా చర్య తీసుకోలేదు.

పార్లమెంటు ఉభయ సభల్లో అభిశంసన తీర్మానాన్ని ఆమోదించడం ద్వారానే సదరు న్యాయమూర్తులను తొలగించగలరు. స్వతంత్ర భారతావనిలో రామస్వామి, సౌమిత్రసేన్ అనే ఇద్దరు న్యాయమూర్తులు మాత్రమే అభిశంసన ఎదుర్కొన్నారు. తాజాగా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు బయటపడ్డాయని వెలువడ్డ వార్త ఉలికిపాటుకు గురిచేసింది.

రుజువైతే ఆయనపై ఏమి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు చర్చనీయాంశం అయింది. న్యాయాధికారులను అవినీతి కేసులలో అరెస్టు చేసి జైలుకు పంపిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఇనుప ఖనిజం గనుల వ్యవహారంలో గాలి జనార్దన్‌రెడ్డి అండ్ కో నుంచి ఐదు కోట్ల రూపాయలు లంచంగా తీసుకున్నారన్న ఆరోపణలపై పట్టాభి రామారావు అనే న్యాయాధికారిని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుమతితో సీబీఐ అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో అవమాన భారంతో కుంగిపోయిన పట్టాభి కొంతకాలానికి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల వద్ద లెక్కల్లో చూపని నగదు స్వల్ప మొత్తంలో దొరికినా అవినీతి నిరోధక సంస్థలు కేసులు పెడతాయి. లంచంగా వంద రూపాయలు తీసుకున్నప్పటికీ నేరం నేరమేనని ఉన్నత న్యాయస్థానాలు ఎన్నో సందర్భాలలో తీర్పులు ఇచ్చాయి. ఈ సూత్రం న్యాయమూర్తులకు వర్తించదా? ఇలాంటి సందర్భాలలో సదరు న్యాయమూర్తులపై చర్యలు తీసుకోని పక్షంలో ప్రజలకు న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఎలా ఉంటుంది? న్యాయవ్యవస్థలోనూ జవాబుదారీతనం ఉండాలి కదా? ఇటీవలి కాలంలో మన న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించడం లేదన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. పశ్చిమ బెంగాల్‌లో ఓ న్యాయమూర్తి ఒక రాజకీయ పార్టీకి అనుకూల వైఖరిని వ్యక్తపరిచారు. తర్వాత రాజీనామా చేసి అదే పార్టీలో చేరిపోయారు. మరో జడ్జి తాను ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుదారునంటూ బహిరంగంగానే ప్రకటించేశారు. పాలకులు ఎంత శక్తిమంతులుగా ఉన్నప్పటికీ న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడిన న్యాయమూర్తులను కూడా చూశాం. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగ్మోహన్ లాల్ సిన్హా సాహసోపేత తీర్పు ఇచ్చారు. అలాంటి నిఖార్సయిన న్యాయమూర్తులు ఎందరో ఉన్నారు. తులసి వనంలో గంజాయి మొక్కల్లా అక్కడక్కడా కొంత మంది దారితప్పుతారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో డబ్బు వ్యవహారంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా త్రిసభ్య కమిటీ చురుగ్గా విచారణ జరుపుతోంది. ఇందులో వాస్తవం ఉంటే ఆ న్యాయమూర్తికి ఏ శిక్ష విధిస్తారోనని కూడా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అవినీతికి పాల్పడిన న్యాయమూర్తులపై రాజ్యాంగంలోని 124వ అధికరణం కింద చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు 50 మందికి మించిన రాజ్యసభ సభ్యుల సంతకాలతో పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెడతారు. ఇదంత త్వరగా తెమిలేది కాదు. ఏదేమైనా మన న్యాయ వ్యవస్థకు కూడా జవాబుదారీతనం ఉండాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# పెద్దపులులపై వేటగాడి గురి!



### ఐదేళ్లలో వేటకు బలైన 100 పులులు .. ఏపీలోనూ మూడు పులుల హతం
### పులి ఎముకలకు చైనా, తైవాన్, జపాన్ దేశాల్లో భారీ డిమాండ్
### మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ కేంద్రంగా పులులను వేటాడే ముఠాలు
### వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో నివేదిక వెల్లడి

నడకలో రాజసం.. ఒళ్లంతా పౌరుషం.. పరుగులో మెరుపు వేగం.. పెద్దపులికే సొంతం. అది ఒక్కసారి గాండ్రిస్తే అడవి అంతా దద్దరిల్లిపోవాల్సిందే. ఏ జంతువైనా తోక ముడుచుకోవాల్సిందే. టన్నుల కొద్దీ ఠీవీని తనలో ఇముడ్చుకున్న పెద్దపులి మనుగడ ప్రమాదపు అంచులకు చేరడం జంతు, పర్యావరణ ప్రేమికులతో పాటు ప్రభుత్వ యంత్రాంగాలనూ ఆందోళనకు గురిచేస్తోంది. పులి గాండ్రిరపు సురక్షితం కావాలన్న ఆకాంక్ష బలంగా వినిపిస్తోంది.

దేశంలో పెద్దపులికి పెనుముప్పు వచ్చి పడిరది. ఐదేళ్లలో పులుల వేట అమాంతం పెరిగింది. పులులను వేటాడి వాటి ఎముకలు, చర్మాలను విదేశాలకు భారీగా అక్రమ రవాణా చేస్తున్నారు. అందుకోసం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో ప్రత్యేకంగా కొన్ని ముఠాలు వ్యవస్థీకృతమై మరీ స్మగ్లింగ్ దందాను సాగిస్తున్నాయి.

పులి ఎముకలకు చైనా, తైవాన్, జపాన్‌లలో పెద్దఎత్తున డిమాండ్ ఉండటంతో ఈ ముఠాలు చెలరేగిపోతున్నాయి. ప్రధానంగా 2024లో దేశంలో పులుల వేట, స్మగ్లింగ్ జోరందుకోవడం ఆందోళన కలిగిస్తోందని కేంద్ర ప్రభుత్వ విభాగం 'వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో (డబ్ల్యూసీసీబీ) తాజా నివేదిక వెల్లడిరచింది.

కొన్నేళ్లుగా చేపడుతున్న చర్యలతో దేశంలో పులుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని సంతోషించేలోగానే.. పులుల వేట కూడా అమాంతం పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచంలో ఉన్న పెద్ద పులుల సంఖ్యలో 70 శాతం భారత్‌లోనే ఉన్నాయి. దేశంలో 58 టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లలో 2022 నాటికి 3,682 పెద్ద పులులు ఉన్నాయి. 2006లో కేవలం 1,411 పెద్ద పులులు మాత్రమే ఉండగా.. 2023 నాటికి వాటి సంఖ్య 3,682కు పెరగడం విశేషం.

కాగా 17 ఏళ్లలో క్రమంగా దేశంలో పులుల సంఖ్య పెరగ్గా.. గత ఐదేళ్లలో పులుల వేట కూడా పెరగడం ప్రతికూలంగా పరిణమిస్తోంది. గత ఐదేళ్లలో స్మగ్లింగ్ ముఠాలు దేశంలో 100 పులులను వేటాడాయి. వాటి ఎముకలు, చర్మం, ఇతర భాగాలను అక్రమంగా రవాణా చేశాయి. 2021-23లోనే 33 పులులను హతమార్చగా... 2024లోనే 42 పులులను వేటాడారు. ఐదేళ్లలో అత్యధికంగా మహారాష్ట్రలో 41 పులులను హతమార్చారు. ఆ రాష్ట్రంలో 2024 డిసెంబర్ 30 నుంచి 2025 జనవరి 22 నాటికి.. అంటే కేవలం 24 రోజుల్లోనే 12 పులులను వేటాడటం దేశంలో స్మగ్లింగ్ ముఠాల బరితెగింపునకు నిదర్శనంగా నిలుస్తోంది. స్మగ్లింగ్‌లో రెండో స్థానంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో ఐదేళ్లలో 10 పులులు వేటగాళ్ల దెబ్బకు బలయ్యాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో మూడేసి, తమిళనాడులో రెండు పులులు హతమవగా... కేరళ, ఉత్తరాఖండ్, బిహార్, పశ్చిమ బెంగాల్లో మిగిలిన పులులను వేటాడారు.

**మందుల తయారీకి పులి ఎముకలు**

చైనా, తైవాన్, జపాన్ తదితర దేశాల్లో పులుల ఎముకలకు భారీ డిమాండ్ ఉండటంతో వాటి వేట పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. మన దేశంలో పులి శరీర భాగాలను వాణిజ్యపరమైన డిమాండ్ ఏమీ లేదు. పులి చర్మాలను స్టేటస్ సింబల్‌గా కొందరు బడా బాబులు తమ బంగ్లాలలో ప్రదర్శిస్తుంటారు. కానీ.. చైనా, తైవాన్, జపాన్ దేశాల్లో పులి శరీర భాగాలకు వాణిజ్యపరమైన డిమాండ్ భారీగా ఉంది. ప్రధానంగా పులి ఎముకలకు ఆ దేశాల్లో అత్యధిక డిమాండ్ ఉంది. చైనా, తైవాన్‌లలో ఔషధాల తయారీకి పులి ఎముకలను వినియోగిస్తున్నారు. పులి ఎముకలను పొడి చేసి వాటిని ప్రత్యేకమైన కొన్ని ఔషధాల తయారీకి వాడుతున్నారు. ఇక జపాన్‌లో పులి ఎముకలను బాగా ఉడికించి ఆ రసాన్ని ఖరీదైన మద్యం తయారీకి వాడుతున్నారు. ఆ దేశాల్లో పులులు లేవు. దాంతో ఆ దేశాల్లోని ఔషధ కంపెనీలు భారత్ నుంచి అక్రమంగా పులి ఎముకలను కొనుగోలు చేస్తున్నాయి.

అందుకోసం ఈశాన్య రాష్ట్రాల్లో ప్రత్యేకంగా ఏజెంట్లను నియమించుకున్నాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కొన్ని ముఠాలు పులులను వేటాడి వాటి శరీర భాగాలను ఆ ఏజెంట్లకు విక్రయిస్తున్నాయి. ఏజెంట్లు ఈశాన్య రాష్ట్రాల్లోని షిల్లాంగ్ - సిల్చార్ - ఐజ్వాల్ - చంఫాయి గుండా దేశ సరిహద్దులు దాటించి మయన్మార్ మీదుగా చైనా, తైవాన్, జపాన్ తదితర దేశాలకు స్మగ్లింగ్ చేస్తున్నారు.

స్మగ్లింగ్ అడ్డుకట్టకు సిట్ ఏర్పాటు

దేశంలో పులుల వేట, స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసింది. ఇది మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తోంది. ఇప్పటికే కొందర్ని అరెస్ట్ చేసింది. పులులను వేటాడే ముఠాల భరతం పట్టేందుకు కార్యాచరణను వేగవంతం చేసింది.

# ఆనందమే జీవన సాఫల్యం



జీవితమనే పూలతోటలో మంచి మనస్సనే మొక్కలను పెంచితే ఆనందమనే పుష్పాలు పూస్తాయి. అలాగే తృప్తి అనే ఎరువు వేసి పెంచితే సంతోషమనే ఫలాలను ఇస్తాయి. జీవితం ఆకాశమంతగా ఊహించుకుంటాం. కాని భూమి అంత ఒర్పులేకపోతే కష్టాలు తప్పవు. సాధారణంగా సంభవించే కష్టాలు,విచారాలు సముద్రమంత పెద్దవిగా భయపెడతాయి. ధైర్యమనే నావను పట్టుకుంటే జీవన సాఫల్యమనే ఒడ్డుకు చేరతాం.కాని కష్టాలను పదేపదే గుర్తు చేసుకుని విచారిస్తే సడిగాలిలో కొట్టుకుపోతాం. మన ఆనందం,సుఖం,విచారం మన మనో విచారంపై ఆధారపడి ఉంటుందని మనస్తత్వవేత్తలు చెబుతారు. అందుకని మన మనస్సును ఎప్పుడూ సంతోషంగా ఉంచుకోవాలంటే కొంత మానసిక వ్యాయామం అవసరమవుతుంది. దానికి ముందుగా ప్రిపేరు అవ్వాలి."జీవితం ఎంతో చిన్నది. యవ్వనం అంతకంటే చిన్నది.అనుభవించరా అనుభవించరా" అన్నాడో సినీ కవి.నిజమేకదా. మన జీవితం ఒకప్పుడు 120 సంవత్సరాలుగా ఉండేది.మనపెద్దలు 100 ఏళ్లపైగా బతకడం మనం చూసాం. ఇప్పటి తరం డెబ్బయి,అరవైలలోనే జీవితాన్ని ముగిస్తున్నారు. చిన్నతనం అంతా ఆనందంగానే గడుస్తుంది. యవ్వనంలో ప్రపంచం రంగుల వలయంగా స్వర్గం లా కనిపిస్తుంది.ఏదైనా సాధించగలమనే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.ఆ వయసులో స్నేహాలు కూడా ప్రభావం చూపుతాయి.ఉన్నత చదువు, ఉద్యోగం, వివాహం జీవితంలో స్థిరత్వం ఇస్తాయి. అది ప్రేమ వివాహం అయితే మళ్లీ జీవితంలో సంక్షోభం.దాన్ని తట్టుకుని నిలబడాలి.అలా నిలబడితే పరిస్థితులు నెమ్మదిగా దారికివస్తాయి.ఆ తరువాత బాధ్యతలు, పిల్లలు.40 దాటితే మధుమేహం,బీపీ,థైరాయిడ్, ఊబకాయం, మోకాళ్ల నెప్పులు వంటి జబ్బులు మన జీవనవిధానం వల్ల వస్తున్నాయి. కాని జీవితాన్ని ఇది భగవంతుడు మనకు కల్పించిన ఒక మహదవకాశంగా భావించి కర్మాచరణ లాగా ఆచరిస్తే ఎలాంటి టెన్షన్లు దరిచేరవు.ఆరోగ్యం భేషుగ్గా ఉంటుంది. అనారోగ్యం మనం తినే ఆహారం, పీల్చే గాలి,త్రాగే నీరు వల్ల కూడా వస్తున్నది. అదికాక ఈ తరం ఉద్యోగాలు సాఫ్టువేరు కావడంతో రాత్రి, పగలనే సమయ పాలనకు అవకాశం ఉండదు.దానితో ఆహార నియమాలకూ ఖచ్చిత్వం ఉండదు.ఇది కూడా ఆరోగ్య హానికి కారణమవుతున్నది. ఎవరైనా పెద్దవారు నిండు నూరేళ్లు చల్లగా ఉండమని ఆశీర్వాదం ఇస్తే అమ్మో అంతకాలం ఈ బాధ భరించ లేమని ఈ తరం అంటున్నారు.అంటే ప్రస్తుతం వచ్చే జబ్బులతో 100 ఏళ్లు బతకడం కష్టమని మానసికంగా సిద్ధమవుతున్నారు.

ఈ కల్తీ ప్రపంచంలో వచ్చే జబ్బులను తట్టుకుని బతకాలంటే మనసును ప్రశాంతంగా ఉంచుకోవడమే. జీవనవిధానం మార్చుకోవడమే. మనం బతికేది కొద్ది కాలమే.ఆ కాలంలో ప్రశాంతంగా, ఆనందంగా బతకాలనే గట్టి నిర్ణయం చేసుకోవాలి. ప్రతి చిన్న విషయానికి ఆవేశపడడం తగ్గించుకోవాలి.ఏది జరిగినా తట్టుకునే మానసిక ధైర్యం అలవరుచుకోవాలి. అందుకు వ్యాయామంతో పాటు యోగా,ధ్యానం(మెడిటేషన్) తప్పని సరిగా రోజువారి కార్యక్రమంలో భాగం చేసుకోవాలి. ఉన్నంతలో తృప్తిగా జీవించాలి.అందుకు కుటుంబసభ్యుల సహకారం తీసుకోవాలి. భార్యాభర్తలు ఒకరంటే ఒకరికి అభిమానం,అవగాహన అవసరం.అలాగే పిల్లలకు చిన్నతనం నుంచే చిన్నచిన్న ఆనందాలే సంతోషాలను కలిగిస్తాయని నేర్పాలి. అలా కుటుంబంలో ఆనందం వెల్లివిరిస్తే నెమ్మదిగా సమాజంలోకి వెళుతుంది. పరస్పర సహకారం,ఎదుటివారు పలకరిస్తే పలకరించడం, ఆవేశం పడకపోవడం,సమస్యను పెద్దదిగా ఊహించకపోవటం, తరచు స్నేహితులు,మనసుకు నచ్చిన బంధువులతో చిన్న చిన్న సమావేశాలు,గెట్ టూగెదర్ పార్టీల్లో పాల్గొనడం వల్ల జీవితం పట్ల ఆసక్తి, అనురక్తి పెరుగుతుంది.తృప్తికి మించిన ఆనందం జీవితంలో ఉండదని నేర్చుకుంటాం.

పాత తరంలో మధ్యతరగతి కుటుంబాలు అధికంగా ఉండేవి. వారికి పిల్లలు కూడా అధికంగానే ఉండేవారు.వారికి సౌకర్యాలు తక్కువే.ఉన్నంతలో తృప్తిగా ఆనందంగా జీవించేవారు.పిల్లల పుట్టినరోజు వస్తే ఆ పిల్ల,పిల్లవాడికి ఉన్నంతలో కొత్త బట్టలు కొని పాయసం వంటి వంటకాలతో కుటుంబంలోనే ఆనందంగా ఆ రోజు గడిపేవారు.చుట్టుపక్కల పిల్లలకు చాక్లెట్ లు పంచేవారు.

ఇటీవల కాలంలో సాఫ్టువేర్‌ఉద్యోగులు,నయా వ్యాపార వర్గాలతో ఉన్నత మధ్యతరగతి వర్గం ఏర్పడింది. దాంతో నయా ట్రెండ్ మొదలైంది. ఏ చిన్న ఆనందమైనా పెద్ద పార్టీగా చేసుకోవడం, స్నేహితులతో, బంధువులతో బ్యాంకెట్ హాల్స్ లో వైభవంగా జరుపుకుంటున్నారు. వీటిలో ఆనందం తక్కువ, ఆర్భాటం ఎక్కువగా కనిపిస్తున్నది. ఆనందమే జీవితమకరందం అనేలా జీవితాన్ని మలచుకోవాలి.అందుకు డబ్బు ఒకటే పరిష్కారం కాదు.ఉన్నదానిలో ఆనందం వెతక్కునేలా ఉండాలి.మానసికంగా బాగున్నామనే భావం అలవర్చుకోవాలి. ఎల్లప్పుడూ ఆశాదృక్పథంతో ఉండాలి. నిరాశావాదానికి దూరంగా ఉండాలి. ప్రతిదీ పాజిటివ్ కోణంలో ఆలోచించాలి. పాజిటివ్ ధోరణి అలవడితే అంతా మంచిగానే కనిపిస్తుంది. ప్రపంచం, సమాజం కూడా అలాగే మనకళ్లకు కనిపిస్తుంది. అదే పరస్పర స్నేహం,ఆత్మీయతలకు చోటు కలిగి ఆనందాన్ని ఇస్తుంది. దాన్నే మనం కోరుకోవాలి.అందుకు ప్రతివారు తమవంతుగా ఉన్నంతలో బాగా ఉన్నామనే భావం అలవర్చుకోవాలి. పక్కవాడికి ఉన్నది మనకు లేదనే భావం రానీయకూడదు. అప్పుడే జీవితం మకరందంలా తియ్యగా ఉంటుంది.

(యం.వి.రామారావు, ప్రత్యేక ప్రతినిధి)

# పంచ సౌశీల్యాలు



బిడ్డలు తమ తల్లితండ్రుల వద్ద మాత్రం నిర్భయంగా ఉండగలుగుతారు.

**శ్లో. భూప్రదక్షిణ షట్కేన కాశీయాత్రాయుతేనచ**
**సేతు స్నాన శతైర్యశ్చ తత్ఫలం మాతృవందనే**

భూప్రదిక్షణ ఆరు సార్లూ, సముద్ర స్నానాలు వందల సార్లూ, కాశీయాత్ర పదివేల సార్లూ చేస్తే వచ్చే పుణ్యం తల్లికి ఒక్కసారి వందనం చేయడంతోనే లభిస్తుందని నీతిశాస్త్రం మాట.

ప్రాచీన కాలం నుండి తల్లి, తండ్రి, గురువులు సమాజంలో మహోన్నత స్థానంలో ఉన్నారు. మనల్ని కని, పెంచి, విద్యాబుద్ధులు చెప్పించి, సంఘంలో ఒక గౌరవ స్థానం కల్పించి, మనకోసం ఎన్నో త్యాగాలు చేసిన తల్లితండ్రులకు ఎంతో ఋణపడి ఉన్నాం.

బిడ్డలను మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి, దేశభక్తి, దైవభక్తి అనే పంచ సౌశీల్యాలను బోధించి వారిని జాతి గర్వించతగ్గ రత్నాలుగా తీర్చిదిద్దాలి. బిడ్డలను పెంచడంలో తండ్రిది గురుతరమైన బాధ్యతే. అయితే అంతకంటే మహత్తరమైన బాధ్యత తల్లిది. తల్లిని మించిన నేర్పరి, శిక్షకురాలు ఇంకెవరుంటారు. పిల్లలకి అమ్మే మొట్టమొదటి గురువు. అమ్మే ఒడే తొలి బడి.

పితృవాక్య పరిపాలనలో అతి పిన్నవయస్సునందే తన యౌవనాన్ని తండ్రికి సమర్పించిన పురూరవుడు, తండ్రి ఆజ్ఞ మేరకు తన కన్న తల్లి, శిరసును ఖండిరచిన పరశురాముడు, తండ్రి కోరిక తీర్చుటకు ఆజన్మబ్రహ్మచర్యం చేపట్టిన భీష్ముడు ఎలా లోకోత్తములయ్యారో తెలిసిందే కదా!

ఎటువంటి భయంకర పరిస్థితి ఏర్పడినా

ఈనాటి సమాజంలో తల్లితండ్రులను అప్యాయతతో ఆదరించే బిడ్డలు అరుదయిపోతున్నారు. జన్మనిచ్చిన తల్లితండ్రులను ప్రత్యక్షదైవాలుగా చూడక పోయినా, వారిని హింసించి, అవమానించకుండా ఉంటే, వారికి ప్రదక్షిణలు, వందనాలు చేసినంత పుణ్యం.

పిల్లలు తల్లిదండ్రులను దుర్భాషలాడడం, అవమానించడం లాంటివి చేయకూడదు.

ఆ విధంగా మాతాపితరులను అగౌరవపరచిన వారికి ఎన్నటికీ మేలు జరగదని ఆర్య ధర్మసూక్తి చెప్తోంది.

అందరి వద్దా భగవంతుడు ఉండలేకే 'అమ్మ'ను మనకందించాడని అంటుంటారు అనుభవజ్ఞులు.

వారికి ఆనందం కలిగించే పనులు చేస్తూ, వారిని వృద్ధాప్యంలో దయతో సేవలందించడం శ్రేయస్కరం. అంతేకాదు అది పిల్లల కనీస ధర్మంకూడా.

- యామిజాల జగదీశ్

# దాస్య బాధితుల అంతర్జాతీయ స్మృతి దినోత్సవం. (మార్చి 25)



1650-1860 సంవత్సరాల రెండు శతాబ్దాల మధ్య కాలంలో సుమారు 10-15 మిలియన్ల ఆఫ్రికన్లు పశ్చిమ ఆఫ్రికా నుండి అమెరికా దేశాలకు బానిసలుగా పంపబడ్డారు. వారిలో ఎక్కువ మంది వెస్టిండీస్, మధ్య అమెరికా, దక్షిణ అమెరికాలకు బానిసలుగా వెళ్లారు. అట్లాంటిక్ మహా సముద్ర ప్రాంతాల్లో జరిగిన ఈ బానిస వ్యాపారాన్ని ప్రారంభం కాక ముందే ఆఫ్రికాలో బానిసత్వం కొన్ని శతాబ్దాల పాటు కొనసాగింది. సాధారణంగా యుద్ధాలలో పరాజితులు బానిసలయ్యేవారు. అమెరికన్లు, ఐరోపా వారు సముద్రయానం ద్వారా కొత్త భూ భాగాలకు వలస వెళ్లి అక్కడ స్థిరపడ్డారు. వారి అభివృద్ధి కార్యక్రమాలకు చౌకగా పనివారు అవసరం కావడం ట్రాన్స్ అట్లాంటిక్ బానిస వ్యాపారానికి దారి తీసింది. ప్రపంచ మానవ చరిత్రలో అమానుషంగా పెద్ద ఎత్తున సాగిన నిర్బంధ వలస ఇది. దాదాపు నాలుగు వందల ఏళ్ల పాటు కొనసాగింది. ఆ బానిసలను చిత్రహింసలకు గురిచేసి, హీనమైన స్థితిగతుల లో పనిచేయించేవారు. ఒక రకంగా చెప్పాలంటే యజమానులు బానిసల రక్తాన్ని తాగారు. వారి ద్వారా సామాజిక నిర్మాణం, ఉత్పత్తి జరిగాయి. బానిసత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఎన్నో ఉద్యమాల్లో ఎందరో ప్రాణాలు కోల్పోయారు. చివరికి 1907 లో బ్రిటన్, అమెరికాలు చట్టబద్ధంగా బానిస వ్యాపారాన్ని నిషేధించాయి. ఈ బానిస వ్యాపారానికి కారణాలు, పరిణామాలు, అది నేర్పిన గుణ పాఠాలను భవిష్యత్ తరాలు తెలుసుకుని జాత్యహంకార వా దం, దురభిమానం గురించి జాగ్రత్త వహించాలని ఐక్యరాజ్య సమితి భావించింది. 2007 డిసెంబర్ 17 న చేసిన తీర్మానం ద్వారా ఏటా మార్చి 25 న తేదీన దాస్య బాధితులు- అట్లాంటిక్ బానిస వ్యాపార అంతర్జాతీయ స్మృతి దినంగా ప్రకటించింది.

డా. జె.వి.ప్రమోద్ కుమార్
పైడిమెట్ట, 9490833108.

# నేను శాశ్వతం కాను



ఈ జీవితం
శాశ్వతం కాదని
ఎలా నిర్ధారణకొచ్చావనేగా
నీ ప్రశ్న

నువ్వు నాకు
శాశ్వతం కాదు

నేను నీకు
శాశ్వతం కాదు

దీనిని
ప్రాతిపదికగా
చేసుకునే చెప్తున్నా
జీవితమూ శాశ్వతం కాదని

శాశ్వతం
అనుకున్నవన్నీ
అశాశ్వతమే అని
నీకింకా ఎలా
చెప్పాలంటావు?

## పంచాంగం

మంగళవారం 25-3-2025
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, శిశిరరుతువు
ఫాల్గుణ మాసం

| | |
|---|---|
| తిథి | : బ. ఏకాదశి రా. 3.46 |
| నక్షత్రం | : శ్రవణం రా. 3.49 |
| వర్జ్యం | : ప. 8.20 ల 9.54 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

### ప్రజా సమస్యల పరిష్కారంపై రాష్ట్ర వ్యాప్తంగా

# సీపీఎం ప్రజా చైతన్య యాత్ర ముగింపు



**కె.కోటపాడు, (విశాఖ సమాచారమ్):-** ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలని సిపిఎం పార్టీ అద్వర్యంలో ఈనెల 14 నుండి 24 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం తల పెట్టిన ప్రజా చైతన్య యాత్రలు లో బాగంగా కోటపాడు మండలంలోని ఈరోజు ముగింపు సందర్భంగా కె కోటపాడు తహశీల్దార్ ఎంపిడిఓ కార్యాలయాలు వద్ద ధర్నాలు చేపట్టి వినతి పత్రాలు సమర్పించడం జరిగింది. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన్ బాబు తదితరులు మాట్లాడారు,జీడీ పిక్కలకు కే జి రెండు వందలు రూపాయలు ఇవ్వాలని,ప్రభుత్వమే ఆర్ బి కె లు ద్వారా కోనుగోలు చేయాలని కోటపాడు పంచాయతీ పరిధిలో పూసల వీది శ్రీక్రిష్ణఆలయం విశ్వ బ్రహ్మణ విది ఎగువ ఎతపెట వి సంతపాలెం %ాజ% కోలణి లో మంచి నీళ్లు సమస్య పరిష్కారం చేయాలని పారిశుద్యం బుడగ జంగాలు కోలణి %ాజ% కోలణి రెళ్ళి వీధి అంగన్వాడీ సెంటర్ తో పాటు అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు,జీవో నెంబర్ 57/2019 ప్రకారం పంచాయతీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని ఉపాధి కూలిలకు బకాయి పడ్డ పన్నెండు వారాలు భకాయిలు వెంటనే చేల్లించాలని,భూములు రీసర్వే చేసిన తరువాత అనేక మంది రైతులకు పాస్ బుక్కులు ఇవ్వలేదని వెంటనే రీసర్వే సమస్యలు పరిష్కరించాలని రైతులకు వెంటనే పాస్ బుక్కులు ఇవ్వాలని కోరారు,మండలంలోని గోవాడ ఘుగర్ ప్యాక్టరి రైతులు భకాయిలు వెంటనే చేల్లించాలని, ఉన్న చేరుకు వెంటనే వేసుకోని,క్రషింగ్ పూర్తి చేయాలని డిమాండ్ చేసారు ఈకార్యక్ర మంలో సిపిఎం మండల కమిటీ నాయకులు ఇర్లే నాయుడు బాబు వి,సూర్యనారాయణ యర్ర దేముడు సిముసు రాము బోళెం సూర్యనారాయణ, వర్రి వెంకట రావు టి రాంబాబు సూరెడ్డి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# Spoken English -9

== If you want to learn English conversation, it helps to know the common English phrases that native speakers use to answer questions!

1. WHAT DO YOU DO?- నీవు ఏమి చేస్తున్నావు?

This question means "What is your job/profession?"

I work in a bank.- నేను బ్యాంకులో పని చేస్తున్నాను.

I'm unemployed at the moment.- ఈ సమయంలో నేను నిరుద్యోగిని.

I run my own business.- నేను నా సొంత వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాను.

# The word "run" means you are the primary person responsible for operating the business.#

I'm retired now. I used to be an engineer.- నేను రిటైర్ అయ్యాను. ఇంజనీర్ గా ఉండేవాడిని.

# "Retired" means you have stopped working (usually after you are 60 or 65 years old).

2. ARE YOU MARRIED?- మీరు వివాహితులా?

Yes, I've been married for two years now.- అవును, నాకు ఇప్పటికి వివాహమై 2 సం. అయ్యింది.

I'm divorced.- నేను విడాకులు తీసుకున్న వ్యక్తిని.

I'm engaged – we're getting married next year.- నాకు నిశ్చితార్థం అయ్యింది.వచ్చే సం. మేము పెళ్ళి చేసుకుంటున్నాము.

No, but I'm in a relationship.- లేదు, నేను సంబంధం కలిగియున్నాను.

Nope, I'm single.- లేదు, నేను ఒంటరిని.

("Nope" is an informal way to say "No.")

3. WHY ARE YOU STUDYING ENGLISH?- నీవు ఎందుకు ఇంగ్లీషు చదువుతున్నావు?

For work.- పని కోసం.

So I can communicate when I travel.- నేను ప్రయాణం చేసేటప్పుడు కూడా సమాచారాన్ని పంపగలను.

I love learning new languages

Because I'd like to immigrate to the U.S.+ యూఎస్ కు వెళదామను కుంటున్నాను కాబట్టి కొత్త భాషలు నేర్చుకోవడానికి ఇష్టపడుతున్నాను.

I'm thinking of studying in England.- నేను ఇంగ్లాండులో చదువుదామనుకుంటున్నాను.

(The correct way is "thinking of studying" and not "thinking to study.")

4. WHERE/HOW DID YOU LEARN ENGLISh- నీవు ఎక్కడ/ఎలా ఇంగ్లీషు నేర్చుకున్నావు?

I took classes for three years- నేను 3 సం. క్లాసులు తీసుకున్నాను.

I did an intensive course.- నేను ఇంటెన్సివ్ కోర్సు చేసాను.

I've been studying on my own - నేను నా సొంతంగా చదువుకుంటున్నాను.

(# You can also say "studying by myself.")

I picked it up from movies and songs.- నేను దీనిని సినిమాలు, పాటలు నుండి నేర్చుకున్నాను.

(In this context, "picked it up" means "learned it casually.")

My girlfriend taught me.- నా గర్ల్ ఫ్రెండు నాకు నేర్పించింది.

5. WHAT DO YOU DO IN YOUR FREE TIME? - ఖాళీ సమయం లో నీవు ఏం చేస్తావు?

I don't have any free time!= నాకు ఖాళీ సమయమంటూ వుండదు.

I usually hang out with friends.- సహజంగా నేను నా ఫ్రెండ్స్ తో గడుపుతాను.

("Hang out" means to spend time in an informal way.)

I go running a lot.-: నేను ఎక్కువ సేపు పరుగెడతాను.

I do volunteer work.+ నేను స్వచ్ఛంధంగా పని చేసాను

I like reading and relaxing at home.- ఇంటి దగ్గర చదవడం, సేద దీర్చుకివడం అంటే నా కిష్టం.

**By Dr.P.V.Ram, Visakhapatnam. 9553574250**

# పార్లమెంట్ నియోజక వర్గాల పునర్విభజన వల్ల నష్టపోతాం

- చంద్రబాబు, పవన్, జగన్ మేల్కోవాలి
- కాంగ్రెస్ కిసాన్ సెల్ చైర్మెన్ కామన




**మండపేట, (విశాఖ సమాచారమ్):-** పార్లమెంట్ నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై తమ వాణిని బలంగా వినిపించేందుకు వెనకడుగు వేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి లు గాఢ నిద్ర నుండి మేల్కొని రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర చైర్మెన్ కామన ప్రభాకరరావు ధ్వజమెత్తారు. మండపేట కాంగ్రెస్ కార్యాలయం లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలు ఉమ్మడి కార్యాచరణకు దిగాయన్నారు. ఇందులో భాగంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో చెన్నైలో జేఏసీ సమావేశం జరిగిందన్నారు. రాష్ట్రం నుండి ఏ ఒక్కరూ నోరు మెదపడం లేదని ఎద్దేవా చేసారు.దక్షిణ భారతదేశ రాష్ట్రాలకు ఇచ్చే నిధుల కన్నా వచ్చే నిధులు మరింతగా తగ్గిపోతాయని పేర్కొన్నారు.

డీలిమిటేషన్ వల్ల కొన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు. మరికొన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గడం వలన ప్రాంతీయ అసమానతలు ఏర్పడి దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్నారు. దక్షిణ భారతదేశానికి ఇచ్చే నిధుల కన్నా వచ్చే నిధులు మరింతగా తగ్గిపోతాయని పేర్కొన్నారు. కేంద్రం నుంచి అందే సహాయంతో పాటు దక్షిణాదికి రాజకీయ ప్రాతినిధ్యం పూర్తిగా తగ్గిపోతుందన్నారు. దేశ అభివృద్ధికి సహకరించిన దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతనిధ్యం తగ్గడం అన్యాయమని పేర్కొన్నారు. జనాభా నియంత్రణ కోసం అప్పట్లో ఇందిరమ్మ చెప్పిన సూచనలు పాటించి, పాటుపడిన రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఉత్తరాది రాష్ట్రాల జనాభా నియంత్రణ పాటించలేదన్నారు. దీంతో ఆయా ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ స్థానాలు రెట్టింపు అవుతాయన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో వీటి స్థానాలు పెరగవని అపుడు రాజకీయంగా వెనుక బాటు తనం కలుతుందని దుయ్యబట్టారు. మరో 20 ఏళ్ల వరకు ఈ ప్రక్రియ చేపట్టవద్దని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ తో పోరాటం చేస్తున్న తమిళ నాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ను ఆదర్శం గా తీసుకొని ఆయనను మద్దతు ఇవ్వాలని కా మన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు కొడవళ్ళ వెంకట సుబ్బారావు, పిల్లి అప్పన్న, మగుళ్ళ శ్రీనివాస్, అలమం డ సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

# నూకాంబిక అమ్మవారి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ గా పీలా నాగ శ్రీను

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం కొత్త అమావాస్య జాతరకు ఉత్సవ కమిటీ చైర్మన్ గా స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ సిఫార్సుతో రాష్ట్ర ప్రభుత్వం పీలా నాగ శ్రీను (గొల్ల బాబు) ను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గా నాగ శ్రీను, పాలకవర్గ సభ్యులుగా సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎర్రవరపు లక్ష్మి లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ ఫ్రా డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వర రావు, జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ హాజరయ్యారు. ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి వెంపలి రాంబాబు, జాతర ప్రత్యేక అధికారిణి కే.శోభారాణి ఆధ్వర్యంలో నూతన పాలకవర్గం పదవీ బాధ్యతలు చేపట్టింది. ..అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ఈనెల 28న జాతర, 29న కొత్త అమావాస్య పండుగను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు.ఈ ఏడాది అమ్మవారి జాతరను అత్యంత




ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. దీనిలో భాగంగా జాతర విజయవంతం చేసే దిశగా ఉత్సవ కమిటీని ఆయన నియమించారని రాంకీ అన్నారు . కాగా ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన పీలా నాగ శ్రీను మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు, జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ, మాజీ ఎమ్మెల్యే పీలా, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, కూటమి ప్రభుత్వం కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి, జాతరను విజయవంతంగా నడిపించే దిశగా శాయ శక్తుల కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, టిడిపి అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అమరవీరులకు ఘన నివాళులు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ 94వ వర్ధంతి సందర్భంగా పరవాడ బీసీ హాస్టల్ లో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ బ్రిటిష్ వలసదారుల నుండి ఈ దేశ ప్రజలకు విముక్తి కలిగించడం కోసం స్వాతంత్ర సంగ్రామంలో అలుపెరగని పోరాటం చేసి అతి చిన్న వయసులోనే ఈ దేశం కోసం ఉరి కొయ్యలను ముద్దాడిన విప్లవ వీర కిషోర్లు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ అని అన్నారు. 23 సంవత్సరాలు వయసులో తన ప్రాణాలను వదిలిన భగత్ సింగ్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ఈ దేశ ప్రగతికి పాటుపడవలసిన యువత అనేక తప్పుడు మార్గాలలో నడవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశంలో చదువుకున్న చదువుకి సరైన ఉపాధి అవకాశాలు లేక బెట్టింగ్ యాప్స్, మాదకద్రవ్యాలు, దొంగతనాలు హత్యలు, మానభంగాలకి పాల్పడుతున్నారని అన్నారు. యువత ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడానికి కారణం దేశంలో పెరుగుతున్న నిరుద్యోగమే దానికి కారణమన్నారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తూనే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ఈ దేశ నిరుద్యోగ యువతను దృష్టిలో పెట్టుకొని భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయ్మెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ చట్టం ద్వారా అయినా నిరుద్యోగులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న విద్య ప్రైవేటీకరణ, కాషాయ కరణ కి వ్యతిరేకంగా మత విద్వేషాలు రెచ్చగొడుతున్న మతోన్మాదులకు వ్యతిరేకంగా దేశ యువతను ఐక్యం చేసి పోరాటాలు శ్రీకారం చుడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కృష్ణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## అప్పారావుకి మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలో ప్రథమ స్థానం

**అరకులోయ, (విశాఖ సమాచారమ్):-** 31 వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీలు మన్యం జిల్లా పార్వతీపురంలో 23-03-2025 ఆదివారం నిర్వహించారు ఈ పోటీలకు అనేక జిల్లాల నుండి బాడీ బిల్డర్స్ స్పాట్స్‌పై చేశారు ఈ పోటీలు ఎనిమిది జనరల్ గాను మాస్టర్స్ రెండుగాను మెన్ ఫిజిక్ ఒకటిగాను విభజించి పోటీ లు నిర్వహించారు ఈ కాంపిటేషన్లో అల్లూరు జిల్లా అరకువేలు మండలానికి చెందిన పిన్నింటి అప్పారావు. మాస్టర్ విభాగంలో ప్రథమ స్థానం దక్కించుకున్నారు. ఆంధ్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రథమ స్థానం దక్కించుకున్న పిన్నింటి అప్పారావుకి, సీల్డ్, మెడల్, తో పాటు ప్రైజ్ మనీ బహుకరించారు. అప్పారావు మాట్లాడుతూ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలలో మాస్టర్స్ విభాగంలో ప్రథమ స్థానం రావడం నాకు చాలా ఆనందంగా ఉంది, మరియు గౌరవంగా ఉందని కొనియాడారు. అలాగే అల్లూరి జిల్లాలో ఉన్న యువత కూడా వ్యాయామాలు చేయాలని, ఆరోగ్య చిట్కాలు పాటించాలని, అలాగే బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొని అల్లూరి జిల్లాకు మంచి పేరు, గుర్తింపు తీసుకురావాలని ఆయన తెలిపారు.

# డా.జొన్నకూటి ప్రమోద్ కి సన్మానం



**తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):-** పద్మ భూషణ్ డాక్టర్ బోయి భీమన్న రచనలపై పరిశోధనా పత్రం సమర్పించిన డా జొన్న కూటి ప్రమోద్ కుమార్ శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో సత్కారం అందుకున్నారు. రాజమండ్రిలో ఏపి ప్రభుత్వ, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో జరిగిన బోయి భీమన్న జాతీయ సాహిత్య సదస్సులో మహాకవి భీమన్న రచనలపై డా ప్రమోద్ సమర్పించిన "డా బోయి భీమన్న రచనల్లో సామాజిక స్పృహ" అనే పరిశోధన పత్రానికి పురస్కారం లభించడం పట్ల పలువురు ప్రమోద్ ను అభినందించారు. కార్యక్రమంలో డా బోయి భీమన్న సతీమణి హైమావతి, శ్రీ శ్రీ కళా వేదిక సి ఇ ఓ డా కత్తిమండ ప్రతాప్, జాతీయ కార్యదర్శి, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ టి. పార్థసారధి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నరసిపల్లి హరిక, శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జి. జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, మహిళా విభాగం అధ్యక్షురాలు చెట్టి లలిత, ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయ తెలుగు సహాయ ప్రొఫెసర్ డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ అద్దంకి రాజయోనా తదితరులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ సమాచారం

## అద్భుతమైన ఉపాధి అవకాశాలు, వొకేషనల్ కోర్సులు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాలాక్షి నగర్, అల్లూరి సీతారామరాజు మార్గ్ లోని బీవీకే జూనియర్ కాలేజీ నందు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వొకేషనల్ కోర్సులు, విశాల ప్రాంగణంలో, నిపుణులైన అధ్యాపకుల చే బోధన, ప్రాక్టికల్స్ నేర్పబడును.

ఔత్సాహికులు వెంటనే పై కాలేజీ అఫీస్ లో సంప్రదించగలరు.

**కోర్సులు**

ఎంపీహెచ్, డబ్ల్యు, ఎంఎల్‌టీ, ఫిజియోథెరపీ, కంప్యూటర్ గ్రాఫిక్స్, యానిమేషన్ తోపాటు ఎంపిసి కోర్సు కూడా కలదు.

## రైట్స్ లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టులు



ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన గుడ్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్.. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

విభాగాలు: సివిల్, మెకానికల్, ఫైనాన్స్, హెచ్ఆర్

పోస్టు పేరు-ఖాళీలు

1. గ్రూప్ జనరల్ మేనేజర్(సివిల్): 02
2. గ్రూప్ జనరల్ మేనేజర్(మెకానికల్): 01
3. గ్రూప్ జనరల్ మేనేజర్(ఈఎస్ & టీ): 01
4. గ్రూప్ జనరల్ మేనేజర్(ఫైనాన్స్): 01
5. డిప్యూటీ జనరల్ మేనేజర్(హెచ్ఆర్): 01

**మొత్తం ఖాళీల సంఖ్య:** 06

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్‌లో ఉత్తర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

**వయోపరిమితి:** గ్రూప్ జనరల్ మేనేజర్‌కు 53 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 41 ఏళ్లు ఉండాలి.

**జీతం:** నెలకు రూ.1,00,000 - 2,60,000.

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు చివరి తేదీ: ఏప్రిల్ 17

## ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లో ఖాళీలు



ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ బెంగళూరు జూనియర్ రీసెర్చ్ ఫెలో, రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 20వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టు పేరు-ఖాళీలు

1. జూనియర్ రీసెర్చ్ ఫెలో: 21
2. రీసెర్చ్ అసోసియేట్: 02

మొత్తం ఖాళీల సంఖ్య: 23

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఈ, ఎంటెక్, ఎంఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 20-04-2025 నాటికి జూనియర్ రీసెర్చ్ ఫెలోకు 28 ఏళ్లు, రీసెర్చ్ అసోసియేట్‌కు 35 ఏళ్లులోపు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: జూనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.37,000, రీసెర్చ్ అసోసియేట్‌కు రూ.58,000.

ఎంపిక ప్రక్రియ: ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.

దరఖాస్తు ప్రారంభ తేదీ: 22-03-2025.

దరఖాస్తుకు చివరి తేదీ: 20-04-2025.

## ఇండియన్ నేవీలో అగ్నివీర్ (ఎస్ఎస్ఆర్ మెడికల్) పోస్టులు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా.. భారత నౌకాదళంలో అగ్నివీర్ ఖాళీల నియామకానికి ప్రకటన వెలువడింది. ఈ నోటిఫికేషన్ ద్వారా అగ్నివీర్ ఖాళీలను భర్తీ చేయనున్నారు. అగ్ని వీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఐఎన్ఎస్ చిల్కాలో ప్రారంభమయ్యే 02/2025, 02/2026 బ్యాచ్ పేరున శిక్షణ ఉంటుంది. మార్చి 29 నుంచి దరఖాస్తు ప్రక్రియ మొదలు కానుంది. ఇంటర్ ఉత్తీర్ణులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**ప్రకటన వివరాలు:**

అగ్నివీర్ (సీనియర్ సెకండరీ రిక్రూట్) ఎస్ఎస్ఆర్ మెడికల్ అసిస్టెంట్ ఖాళీలు

**అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ (పీసీబీ) ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్మీడియట్ (10o2) ఉత్తీర్ణులై ఉండాలి.

**వయస్సు:** ఎస్ఎస్ఆర్ (మెడికల్) 02/2025 బ్యాచ్‌కు అభ్యర్థి 01.09.2004 - 29.02.2008బీ ఎస్ఎస్ఆర్ (మెడికల్) 02/2026 బ్యాచ్‌కు 01.07.2025- 31.12.2025 మధ్యలో జన్మించి ఉండాలి. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేయాలి.

కనిష్ఠ ఎత్తు ప్రమాణాలు: పురుషులు, మహిళలు కనీసం 157 సెం.మీ. ఎత్తు ఉండాలి.

**ఎంపిక ప్రక్రియ:** అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, స్టేజ్-1 (ఇండియన్ నేవీ ఎంట్రన్స్ టెస్ట్), స్టేజ్-2 (రాత పరీక్ష, శారీరక దార్ఢ్య పరీక్ష- పీఎఫ్‌టీ), వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

**శిక్షణ:** అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో 01/2025 బ్యాచ్‌కు సెప్టెంబర్2025 నెలలోబీ 02/2026 బ్యాచ్‌కు జులై నెలలో కోర్సు శిక్షణ ప్రారంభమవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

జీత భత్యాలు: ఎంపికైన అభ్యర్థులకు రూ.21,700- రూ.69,100 వేతనం లభిస్తుంది.

**కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** ప్రశ్నపత్రం హిందీ/ ఇంగ్లిష్ భాషల్లో మొత్తం 100 బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఒక్కొక్కటి 1 మార్కు చొప్పున 100 మార్కులను కలిగి ఉంటుంది. ఇంగ్లిష్, సైన్స్, మ్యాథమెటిక్స్, జనరల్ అవేర్‌నెస్.. నాలుగు విభాగాల్లో ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి ఒక గంట. నెగెటివ్ మార్కింగ్ అమలులో ఉంటుంది. నాలుగు తప్పు సమాధానాలకు ఒక మార్కు కోత విధిస్తారు.

**దరఖాస్తు ఫీజు:** రూ.550.

**దరఖాస్తు విధానం:** అభ్యర్థులు నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

**ముఖ్య తేదీలు..**

ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు ప్రారంభం: 29-03-2025.

ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు చివరి తేదీ: 10-04-2025.

## డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కెజీహెచ్‌లో రక్తదాన శిబిరం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** దేశ స్వాతంత్ర సాధనకై ప్రాణాలర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల 94వ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ హాస్పిటల్ కేజీహెచ్ లో బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేజీహెచ్ డాక్టర్ సునీత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ సునీత డివైఎఫ్ఐ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన యువజన సంఘం ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. కేజీహెచ్ లో నిరంతరం ఆపరేషన్లు జరుగుతాయని మన రాష్ట్రం తో పాటు పక్క రాష్ట్రాలకు చెందిన వారికి కూడా సేవలు అందిస్తున్నామని అన్నారు. రక్తదానం చేయటం వలన ప్రయోజనాలను వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు రాజు,సంతోష్, ఉపాధ్యక్షుడు శ్రావణ్, గణేష్ నాయకులు అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబిక అమ్మవారి పండగ కరపత్రాలు విడుదల



**కే.కోటపాడు, (విశాఖ సమాచారమ్):-** ఈనెల 29న జరుగు నూకాంబిక అమ్మవారి జాతర కరపత్రాలను కోటపాడు మాజీ సర్పంచ్ దోకల లక్ష్మీనరసింహ మూర్తి విడుదల చేశారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మండల కేంద్రం కోటపాడు లో అత్యంత భక్తి శ్రద్ధలతో నూకాంబిక కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న కొత్త అమావాస్య పండగ అతి వైభవంగా జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక ఆకర్షణగా కోటి వత్తుల దీపారాధన కార్యక్రమం జరుగుతుందని , అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు నూకాంబిక ఉత్సవ కమిటీ సభ్యులు వైలెట్ త్రినాధ్, మేడిశెట్టి నానాజీ, సమ్మెంగ అప్పలరాజు తదితరులు తెలిపారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## గోవాడ చెరుకు రైతులు బకాయిలు వెంటనే చెల్లించాలి




**కే.కోటపాడు, (విశాఖ సమాచారమ్):-** గోవాడ చెరుకు రైతుల బకాయిలను వెంటనే చెల్లించాలని సిపిఎం నాయకులు గండి నాయన బాబు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. పాడైపోయిన రోడ్లను వెంటనే మరమ్మత్తులు నిర్వహించాలని రైతులకు ఇస్తామన్న రైతు భరోసా నేటికీ రాలేదని కూటమి ప్రభుత్వం వెంటనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దాసరి వెంకన్న ఎర్ర దేవుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ కృష్ణను కలిసిన టిడిపి జనసేన యువగళం



**తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్):-** తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామానికి చెందిన టీడీపీ పెద్దలు యువకులు ఇమ్మణి వీర శంకరం ఆధ్వర్యంలో రాజీవ్ కృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ కార్యక్రమంలో మలకపల్లి గ్రామ జనసేన అధ్యక్షులు పోకనాటి ముత్యాలరావు, మన్యం చిన్నబ్బులు, టిడిపి సీనియర్ నాయకులు, ముళ్ళపర్తి వీర్రాజు, మాజీ సొసైటీ డైరెక్టర్ అరికరేవుల గ్రామం నుండి చావా శ్రీను, యనమదల కృష్ణారావు, కంచర్ల గోపి, దండమూడి సుబ్బారావు చౌదరి, బచ్చు కిషోర్, గెద్దం సుబ్బారావు, గెద్దం విజయ్, జొన్నకూటి సురేష్ బాబు, గెద్దం బాలు మరింత మంది టిడిపి నాయకులు కార్యకర్తలు మీ సమక్షంలో పనిచెయ్యడానికి మేము సిద్ధంగా ఉన్నామని సంతోషాన్ని వ్యక్తం చేసారు.

## స్మశానం ప్రహరీ గోడ నిర్మాణానికి 25 లక్షలు జీవీఎంసీ నిధులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** 84 వ వార్డు కొండ కొప్పాక గ్రామంలో స్మశానం బహిరంగంగా ఉండటంవల్ల ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలియజేసిన మేరకు జీవీఎంసీ సమావేశంలో వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి అధికారులు దృష్టికి తీసుకువెళ్లగా స్మశాలి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించేందుకు, 25 లక్షలు జీవీఎంసీ నిధులు మంజూరు చేశారని వార్డు ఇంచార్జ్ నీలాబాబు తెలియజేశారు. సోమవారం ఉదయం సచివాలయంలో సమగ్ర సర్వే పై అవగాహన కల్పించడానికి కొండ కొప్పాక సచివాలయంలో మహిళలతో సమావేశం అనంతరం ప్రజలు విజ్ఞప్తిపై స్మశానవాకటి పరిశీలనకు సచివాలయ సిబ్బంది తో నీలబాబు కలిసి పనులు జరుగుతున్న విషయాలను ఏఈ ని అడిగి తెలుసుకుని తొందరగా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులకు నీలబాబు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వానపల్లి బాబురావు, బోయిన మురళి, వామాల కాశీ, జనసేన నాయకులు గిరి, గోపి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## హత్యకు గురైన ట్రాన్సజెండర్ దీప మృతి పై సంతాపం వెలిబుచ్చిన జనసేన నేత రాంకీ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి నియోజక వర్గంలో లో హత్యకు గురైన ట్రాన్సజెండర్ దీప మృతి పై స్థానిక ఏఎంసి కాలనీ లో ట్రాన్సజెండర్స్‌ని కలిసి అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ బీమరశెట్టి రాంకీ సంతాపం వెలిబుచ్చారు. సంఘటన జరిగిన రోజు విషయం తెలిసిన వెంటనే స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జిల్లా ఎస్. పి తో మాట్లాడారు అని అన్నారు, ఇప్పుడు నిందితుడిని పట్టుకొని జైలుకు పంపడమే కాకుండా కేసు త్వరతగతిన ట్రయిల్ అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అని అన్నారు, ఈ సందర్భంగా ట్రాన్సజెండర్స్ మాట్లాడుతూ మాకు అంటూ ప్రత్యేక చట్టాలు లేవు అని, మాకు అన్యాయం జరిగితే సమాజం, వ్యవస్థలు స్పందించడం లేదు అని తెలిపిన వెంటనే రాంకీ మాట్లాడుతూ కొణతాల రామకృష్ణ నియోజకవర్గనికి వచ్చిన వెంటనే మీతో సమావేశం ఏర్పాటు చేస్తామని మీ సమస్యలు పరిస్కారం అయ్యే విధంగా రామకృష్ణ చూస్తారని అన్నారు, ఈ కార్యక్రమంలో రాంకీ తో పాటు జన సేన నేతలు తదితరులు పాల్గొన్నారు.

## 3 మంచి నీళ్ళు బోర్లు ప్రారంభం



**రావికమతం, (విశాఖ సమాచారమ్):-** చినపాచిల గ్రామంలో ఎంపిటిసి నిధులతో 3 మంచి నీళ్ళు భోర్లు ను ఎంపిటిసి ముచ్చకర్ల గంగభవాని, సర్పంచ్ కోమటి రామలక్ష్మి, ఉప సర్పంచ్ కోమటి శంకరరావు, పాలసంఘం అధ్యక్షులు ఆదాడ రాజారావు, టి డి పి సీనియర్ నాయకులు కోన నాయుడు బాబు, ముచ్చకర్ల సూరిబాబు పాల్గొనడం జరిగింది. ఈ భోర్ లను కోరుకొండ వరహాలమ్మా పాకలు వద్ద ఒక బోరు ను,సాసుబిల్లి అప్పలస్వామి నాయుడు ఇంటి వద్ద మరియు చినపాచిల ఎస్ సి కాలనీలో అంబేద్కర్ విగ్రహం వద్ద బోర్లను ప్రారంభించారు.

## అల్యూ మినియం కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి లో అల్యూ మినియం కంపెనీలో (తపాలాలు, బిందెలుతయారు) పనిచేస్తూ జీవిస్తున్న కార్మికులు కూటమి ప్రభుత్వం అర్హులైన వారికీ ఇల్లు స్థలాలు మంజూరు చేసి ప్రభుత్వమే ఇల్లు కట్టి యివ్వాలని అనకాపల్లి అల్యూ మినియం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ )ప్రధాన కార్యదర్శి బుద్ధవీర భద్ర రావు డిమాండ్ చేశారు స్థానిక గవర పాలెం శ్రీ నూకాలమ్మ ఆర్చి వద్ద సంఘం వన సమారాధన కార్యక్రమం జరిగింది కార్యక్రమానికి ముఖ్య అతిధి గా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కోన లక్ష్మణ హాజరై మాట్లాడుతూ రేడిమెడీ వస్తువులు వచ్చిన తర్వాత అల్యూ మినియం కంపేని లో కార్మికులు పని లేకుండా పోయింది అన్నారు. ప్రభుత్వం కార్మికులు కార్పొరేషన్ రుణాలు మంజురు చేయాలని డిమాండ్ చేశారు అనంతరం సంఘంఅధ్యక్షులుగా పదవి విరమణ పొందిన నీలకంఠ శ్యామ్ కు సభ్యులు చిరు సత్కారం చేశారు. సంఘం గౌ రవ అధ్యక్షులు కొండూరు వీరచారి మాట్లాడుతూ శ్యామ్ సంఘం అధ్యక్షులు గా ఉండి చేసిన సేవలు కొనియాడారు కార్యక్రమం లో సంఘం సీనియర్ నాయకులు ప్రేరాజు,సహాయ కార్యదర్శి ,కె. శ్రీను,కోశాధికారి కొండూరు. గిరిబాబు, పెంట కోట శ్రీనివాస్, ఈగల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వికలాంగులకు విరాళం అందజేత




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** లేబెన్స్ హిల్స్ మానసిక వికలాంగుల శ్రేయస్సు కొరకు బాధ్యత వహించిన విశాఖ పోర్టు అథారిటీ విశాఖపట్నం వారు సిఎస్ఆర్ ఫండ్ నిమిత్తం పేద బాల బాలికలకు రవాణా సౌకర్యం ఒక బస్సు నెం. ఎపి39యువై 1551 ఉచితంగా విరాళం అందచేశారు.

లెబెన్స్ హిల్స్ మానసిక వికలాంగుల పాఠశాలలో 200 మంది నిరు పేద బాల బాలికలకు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ మరియు థెరిపిలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుంది.

విశాఖ పోర్టు అథారిటీ విశాఖ పట్నం వారు చేసిన సహాయ సహకారం నకు లెబెన్స్ హిల్స్ కమిటీ సభ్యులు తల్లి తండ్రులు మరియు సిబ్బంది కృతజ్ఞతము తెలియచేశారు.

అదే విధంగా ఈ విషయాన్ని తెలియ చేసిన లెవెన్స్ హిల్స్ సెక్రటరీ జనరల్ గుమ్మలూరి లక్ష్మీసూర్యశ్రీ, ట్రెజరర్ విజయ కుమార్ గారు హర్షం వ్యక్తం చేశారు.

## వేసవిలో పక్షులకు దాహార్తి తీర్చేందుకు మట్టి పాత్రలు ఏర్పాటు చేసిన గ్రీన్ క్లబ్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి గ్రీన్ క్లబ్ వేసవిలో పక్షులకు దాహార్తి తీర్చేందుకు పలు దేవాలయాల్లో దాన్యపు కుంచెలు మట్టి పాత్రల్లో త్రాగునీరు పక్షులకు గూళ్ళు ఏర్పాటు చెసే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు వ్యక్తిగత సహాయకులు విజయ నాయుడు ముఖ్య అతిదిగా హాజరయ్యారు. పట్టణంలోని పలు దేవాలయాల్లో పక్షులకు గూళ్ళు, త్రాగునీటి మట్టి పాత్రలు, ధాన్యపు గింజల కుంచెలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయ నాయుడు మాట్లాడుతూ పక్షుల కోసం ప్రతి ఒక్కరూ వేసవిలో తిండి గింజలు ఏర్పాటు చేయాలని అలాగే మట్టి పాత్రలో నీళ్ల ఏర్పాటు చేస్తే అవి దాహార్తి తీర్చుకుంటాయని అన్నారు సమస్త జీవ వైవిధన్ని కాపాడాలని అందరూ పర్యావరణ జాగృతి కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ వచ్చే నెలలో రెండవ ఆదివారం అనకాపల్లిలో పార్కులలో పక్షులకు, ధాన్యపు కుంచలు మట్టి పాత్రలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో భోగ లింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, పెంటకోట ఉమా మహేశ్వర రావు, బిఎస్ ఎం.కె జోగి నాయుడు, బొద్దేడ మురళి, వంకాయల ఈశ్వరరావు పేరూరు చిన్నస్వామి నైశెట్టి సత్తిబాబు, బేతాళం శేష సాయి తదితర గ్రీన్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కంచరపాలెంలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** కంచరపాలెం జాషువా కళా ప్రాంగణంలో జరిగిన ఎస్సీ -వర్గీకరణ విజయోత్సవ సభకు గోటివాడ నర్సింగ రావు, మాజీ అధ్యక్షులు, విశాల విశాఖ మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షులు అధ్యక్షతన వహించారు.

ఈ సభకు ముఖ్య అతిథిలుగా ప్రొఫెసర్ పసలపూడి జార్జ్ విక్టర్ (మాజీ వైస్ -ఛాన్సెలర్), కొప్పుల వెంకట రావు (మాజీ సీనియర్ కార్పొరేటర్) పాల్గొన్నారు.

ఈ సభకు విశిష్ఠ అతిథిగా ఈవీఆర్. కుమార్ (ఎంఆర్పీఎస్ ఉత్తరాంధ్ర జిల్లాల మాజీ కన్వీనర్ & సీనియర్ నాయకులు) పాల్గొన్నారు.

మాదిగ విజయోత్సవ కేక్ కటింగ్, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అందరు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అకుంటిత దీక్షను, వారి కృషిని, వారి పట్టుదలను, వారి నాయకత్వంను గూర్చి కొనియాడారు.

జార్జ్ విక్టర్ ప్రసంగిస్తు ఎస్సీ వర్గీకరణ కు సంబందించిన వివిధ కమిటీ రిపోర్టులను గురించి చర్చించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో విశాఖ నగర ఎంఆర్పిఎస్ నాయకులు, ఎంఈఎఫ్ నాయకులు, ఎంఎస్పి నాయకులు, ఎంఎస్ఎఫ్ నాయకులు అలమండ ప్రసాద్ (జాషువా కళ ప్రాంగణం అధ్యక్షులు) గుమ్మడి ఆది నారాయణ మూర్తి ,గుమ్మడి హనుమంత రావు , గుమ్మడి అచ్చి బాబు , కడితి సాధు రావు , రాయి అప్పారావు

డాక్టర్ చదువుల ఆశ కిరణ్, గంట్యాడ అప్పలరాజు, గొడవ కనక రాజు, సూర్య నారాయణ, చేవ్వేటి అప్పా రావు, చేవ్వేటి మంగ పాల్గొన్నారు.

## దద్దరిల్లిన చరణ్ గ్రూప్ హౌసింగ్ ప్లాట్ల మేళా

**సామాన్యులకు మధ్య తరగతి వారికి అందుబాటు ధరల్లో హౌసింగ్ ఫ్లాట్లు**

**తక్కువ ధరకే అపార్ట్మెంట్లో ప్లాట్లు**

**చరణ గ్రూప్ అధినేత పరంధామయ్య నాయుడు**



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** చరణ్ గ్రూప్ సంస్థల అధినేత పరంధామయ్య నాయుడు ఆదివారం భీమిలిలో నూతనంగా నిర్మిస్తున్న చరణ్ రాయల్ ప్యాలెస్ వద్ద అపార్ట్మెంట్స్ ప్లాట్ల మేళా నిర్వహించారు. తక్కువ ధరకే అపార్ట్మెంట్లో ప్లాట్లు కావడంతో సామాన్య ప్రజలు కొనుగోలుకు ఎగబడ్డారు. దీంతో ఈ ప్రాంతమంతా కొనుగోలుదారులు మరియు తన గ్రూపు ఉద్యోగస్తులతో పండుకు వాతావరణం లా మారింది. ఈ సందర్భంగా చరణ్ గ్రూప్ అధినేత పరంధామయ్య నాయుడు విశాఖ సమాచారం బ్యూరోతో మాట్లాడుతూ సామాన్యులకు సొంత ఇంటి కల కలగానే మిగిలిపోతుందని ఆ కలలను సాకారం చేసేందుకు మా సంస్థ అయినా చరణ గ్రూపు తక్కువ ధరకే నిర్మాణం చేసిన ప్లాట్లను అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఎటువంటి ప్రజానీకం ఐనా స్థలం కొనుక్కొని ఇంటి నిర్మాణం చేపడితే ఎలా లేదన్న సుమారు 60 లక్షల వరకు అవుతుందని, అటువంటిది భీమిలి లో నిర్మిస్తున్న చరణ్ గ్రూప్ చేపట్టిన చరణ్ రాయల్ ప్యాలెస్ లో ప్లాటు అంతకంటే తక్కువ ధరకు లభిస్తుందని ఆయన అన్నారు. దీని తోడు బ్యాంకు లోన్ సౌకర్యం కూడా ఉన్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చరణ్ గ్రూప్ డైరెక్టర్లు గొల్లి అప్పలనాయుడు (నాని), శ్యాంసుందర్రావు, చంద్రశేఖర్, సాగర్, గొంతిన శ్రీనివాసరావు, కిరణ్ మోహన్ రవు, మరియు ప్రధాన కార్యాలయం మేనేజర్ పద్మావతి,తదితర సిబ్బంది,అధిక సంఖ్యలో కొనుగోలుదారులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లకు రూ. కోటి విరాళం

**అమరావతి, (విశాఖ సమాచారమ్):-** దివంగత పారిశ్రామికవేత్త నార్నే రంగారావు జ్ఞాపకార్థం ఆయన అర్ధాంగి డాక్టర్ శాంతారావు నార్నే, 'అన్న క్యాంటీన్'కు భారీ విరాళం ప్రకటించారు. సీఎం చంద్రబాబును కలిసిన డాక్టర్ నార్నే శాంతారావు రూ. 1,00,01,016 చెక్ ను అందించారు. ఈ సందర్భంగా నార్నే శాంతారావు మాట్లాడుతూ ఏపీలో కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిన సందర్భంగా నారా భువనేశ్వరి గారు కోటి రూపాయల విరాళం ఇవ్వడం తనకు స్ఫూర్తినిచ్చిందని డాక్టర్ శాంతారావు ఈ సందర్భంగా తెలిపారు. నార్నే రంగారావు మరణించడానికి ఒకరోజు ముందు కూడా ఈ విరాళం గురించి గుర్తు చేశారని ఆమె అన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. "నార్నే రంగారావు మరణానంతరం తన కుమార్తె, నార్నె ఎస్టేట్స్ డైరెక్టర్ అదుసుమిల్లి దీప, వైట్ ఫీల్డ్ బయో ఎండీ అదుసుమిల్లి నరేష్ కుమార్‌తో కలిసి వచ్చి శాంతారావు గారు ఈ విరాళాన్ని సీఈవో నార్నె గోకుల్ తోడ్పాటుతో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు.

## సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల వినతి




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** మదర్ థెరిసా వికలాంగుల పొదుపు సేవా సంఘం ఇరుకు వాని పాలెం గ్రామం కసిరెడ్డి అర్జున ఆధ్వర్యంలో అనకాపల్లి వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పై సోమవారం స్పందన కార్యక్రమంలో వినతిపత్రంసమర్పించారు.

వికలాంగుల సబ్సిడీ కింద ఉన్న పొదుపు సంఘాలకు మరియు వికలాంగులకు ఎటువంటి ష్యూరిటీ లేకుండా పది లక్షల వరకు బ్యాంక్ లోను మంజూరు చెయ్యాలనీ, అలాగే వ్యక్తిగత సబ్సిడీ లోన్ ఎటువంటి హామీ లేకుండా సదరన్ సర్టిఫికేట్ ఆధార్ కార్డు రేషన్ కార్డు ఆధారంగా బ్యాంక్ లోన్ కొరకు మజూరుచేయాలనీ, వికలాంగులకి అనకాపల్లి జిల్లా ఉమ్మడి విశాఖపట్నం జిల్లా 600, 500 సిటీ మెట్రో ఎక్స్ప్రెస్ లో ఉచితంగా తిరిగే విధంగా బస్సు పాసులు అనుమతి ఇవ్వటం లేదని ఒక 500, మెట్రో ఎక్స్ప్రెస్ లో గతంలో పది రూపాయలు టికెట్ పై జిల్లా పరిమితం ఉండేది కానీ ఇప్పుడు ఏపీసి ఆర్టిసి వారు వికలాంగుల్ని ఇబ్బందిపాలు చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న వికలాంగులు పెళ్లి తో సంబంధం లేకుండా ప్రతి వికలాంగుడికి ఇల్లు నిర్మాణం ద్వారా లేదా విద్యుత్ నీరు మజూరు చేసి వారిని ఆదుకోవాలనీ విన్నపం చేసారు. జిల్లాలో వికలాంగుల చట్టం 2016 అమలుకి ఏర్పాటు కి చేయవలసిందిగా కోరారు. ఈ స్పందన కార్యక్రమంలో మదర్ థెరిసా వికలాంగులు సేవా సంఘం అధ్యక్షుడు కసిరెడ్డి అర్జున్ దూడ నూకరాజు , గోవిందా శ్రీనివాసరావు , కోటేశ్వరరావు, కనకరాజు ,ధనలక్ష్మి , ధనలక్ష్మి లక్ష్మణరావు , మడక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పారిపోతున్న హత్య కేసు నిందితుణ్ణి పట్టుకున్న ఎస్.ఐ.



**కొవ్వూరు, (విశాఖ సమాచారమ్):-** రాజమండ్రి రూరల్ లో జరిగిన డబుల్ మర్డర్ కేసులో నిందితుడు పరారౌరవుతున్న సమయంలో ముళ్ళ కంచెలలో పరిగెడుతూ నిందితుడిని అదుపులోకి తీసుకుంటున్న సందర్భంలో నిందితుడి నుంచి ప్రతిఘటన ఎదురైంది. స్వల్పగాయాలైనప్పటికీ కర్తవ్య నిర్వహణలో ధైర్యసాహసాలు చూపించి నిందితుడ్ని అదుపులోకి తీసుకున్న కొవ్వూరు రూరల్ ఎస్ఐ శ్రీహరి.

# అనకాపల్లి జనసేన పార్టీలో చిన్ని ఎవరు ?

- చిన్ని కి పార్టీతో ఉన్న సంబంధం ఏమిటి ?
- జనసేన నాయకులు కోరిబిల్లీ పరి ఆవేదన



**కశింకోట, (విశాఖ సమాచారమ్):-** పార్టీలోకి కొత్త వ్యక్తులు రావడంతో సీనియర్ కార్యకర్తలకు విలువ లేకుండా పోతుందని జనసేన పార్టీ నాయకులు కోరుబెల్లి పరి ఆవేదన చెందారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అనకాపల్లి జనసేన పార్టీ లో గత సంవత్సరం ముందు పరి జాయిన్ అయ్యారని అలాగే ఎలక్షన్లో తను మరియు తన అనుచరులు కలసి తమ వంతు ఎంతో కష్టపడ్డారని తెలియచేసారు.గత 10 సంవత్సరాల నుంచి జనసేన పార్టీ కి ఎంతోమంది కష్టపడి,ఎన్నో బాధలు ఓర్చి మంచి విజయం సాధించిపెట్టారు కానీ ఇప్పుడు ఆ కష్టానికి తగిన ప్రతిఫలం వచ్చిందని ఆనందపడాలో, బాధపడాలో తెలియని పరిస్థితిలో సీనియర్ కార్యకర్తలు ఉన్నారని, గత సంవత్సరం నుంచి అభివృద్ధి పరంగా చూస్తే రామకృష్ణ మంచి అభివృద్ధి పనులు చేస్తున్నారు.ఆ విషయంలోనే జనసైనికులు సంతోషంగా ఉన్నారు.కార్యకర్తలకు కొన్ని లోటు పాటులు ఉంటే వాళ్ళు వచ్చి ఆ పార్టీ ఇన్చార్జి కు లేదా పార్టీ ని కలిసి చెప్తారు.కార్యకర్తలు ఎవరు ఏ కార్యక్రమం చేసిన బోర్డులు పెట్టిన అన్ని విషయాల్లో చిన్ని అనే వ్యక్తి కలగజేసు కుంటున్నారనీ, కొత్తగా వచ్చిన వాళ్ళకి రిసీవింగ్ ఇస్తున్నారు,సీనియర్ కార్యకర్తలను కనీసం పలకరించడం కూడా కష్టం అవుతుంది,

ఇదే కార్యకర్తలు బోర్డులు పెట్టి కూటమి నాయుకుల ఫోటోలు వేస్తె ఆ బోర్డు పెట్టిన కార్యకర్తలు కి ఫోన్ చేసి వార్నింగ్ ఇవ్వడమే కాకుండా వారు ఆ ఫోటో వద్దు, ఈ ఫోటో వద్దు అని చెప్పుతున్నారు.ఆ వార్నింగ్ కూడా ఎవరూ ఎక్కువ భయపడతారో వాళ్లకి వార్నింగ్ ఇస్తున్నారు.ఇతనికి పార్టీకి సంబంధం ఏమిటి అని అలాగే అన్ని విషయాల్లో ఎంటర్ అయిపోయి పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారని తక్షణమే ఈయనకు పార్టీ కి సంబంధం లేదని,జనసేన నాయకులు ఒకసారి కార్యకర్తలు కి వివరించాలని తెలిపారు,ఈవిషయంపై శాసన సభ్యులు రామకృష్ణ కు, చిన్ని మీద కంప్లైంట్ ఇద్దాము అనుకున్నానని అలాగని రామకృష్ణ కి ఫోన్ చేసినాసరే పక్కన చిన్ని ఉంటున్నారని ఆయనకు ఫోన్ చేస్తే చిన్ని లిఫ్ట్ చేస్తున్నారు అని కోరిబిల్లి పరి ఈ సందర్భంగా తన ఆవేదన వ్యక్తం చేసారు. ఈ విషయంపై రీసెంట్ గా కొణతాల రామకృష్ణ విజయవాడ లో ఉన్నారని తెలిసి ఫోన్ చేస్తే చిన్ని లిఫ్ట్ చేశి మాట్లాడారని చెప్పుకొచ్చారు. ఈ సమస్య ని ధీమా చేశి పట్టించుకోక పోతే పార్టీకి చాలా పెద్ద ప్రమాదం జరుగుతుందని, ఇప్పుడు దాకా జనసేన సైనికులు కష్టపడినదంతా కూడా వృధా అవుతుందని దయ ఉంచి అనకాపల్లి జనసేన కార్యకర్తలు, కూటమి కార్యకర్తలు బాధను జనసేన పార్టీ అధ్యక్షులు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అనకాపల్లి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు మరియు మాజీ మంత్రి అనకాపల్లి ఎమ్మెల్యే కోణాతాల రామకృష్ణ కు పరి విన్నపం చేసుకుం టున్నమనీ, కోరుతున్నాం అని ఈసందర్భంగా తన పరి ఆవేదన వ్యక్తం చేసారు.

# చింతలపాలెంలో ఉల్లాస్ కార్యక్రమం



**కశింకోట, (విశాఖ సమాచారమ్):-** మండలంలోని సోమవారం చింతలపాలెం గ్రామం లో ఉల్లాస్ ( అక్షర వెలుగు) కార్యక్రమంలో భాగంగా నిరక్షరాసులైన మహిళలను సమయం కేటాయించుకుని చదువు నేర్చుకోవాలని మహిళలు చదువు నేర్చుకోవడం వలన రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని, చదువు రానున్న రోజుల్లో ఎంతో ఉపయోగపడుతుందని అందువల్ల ప్రతి ఒక్క మహిళ వ్యక్తిగత వ్యక్తిగత శ్రద్ధతో ఈ పథకం వినియోగించుకోవాలని మాజీ మంత్రివర్యులు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ & ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ కోరారని కూటమి నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి / గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకు నాయుడు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు ఆనాల తాతీలు నాయుడు,గ్రామ పార్టీ అధ్యక్షుడు కోన రమణ, జనసేన నాయకులు మరపురెడ్డి గిరిబాబు, కాపుశెట్టి శివ, పులివంతులు గణేష్, పూడి మణికంత, తెరపల్లి అప్పారావు మరియు కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# రోడ్లపై ఇసుక తొలగించాలి



**తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):-** తాళ్లపూడి మండలం పరిధిలో ఉన్న ఇసుక ర్యాంపులు సమీపంలో ఇసుక రవాణా చేసే లారీలో కారణంగా ఆర్ అండ్ బి రోడ్ల పై ఇసుక చేరడం వలన ద్విచక్ర వాహనదారులు ప్రమాద బారిన పడకూడదని అటువంటి ప్రాంతాల్ని సోమవారం శుభ్రం చేయించినట్లు ఇన్చార్జ్ తహసిల్దార్ మోహన భారతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం పలు పత్రికలలో ప్రచురించిన వార్తలపై స్పందిస్తూ తగిన సిబ్బందిని ఏర్పాటు చేసి రోడ్లపై ఉన్న ఇసుక ను తొలగించడం జరిగిందన్నారు. అంతే కాకుండా ఇసుక ర్యాంపుల నుండి బయలుదేరే లారీలు రవాణా కి ముందే లారీపై టర్పాలిన్ ఏర్పాటు చేసుకుని వెళ్లాలని హెచ్చరించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఏటిగట్టు ప్రాంతంలో మరియు గ్రామాలలో లారీలు వేగంగా వెళ్లకూడదని హెచ్చరించారు. తాళ్లపూడి మండల పరిధిలో ఉన్న పలు బోట్ మెన్ సొసైటీ ర్యాంపు లలో రాత్రి సమయంలో డ్రిజ్జింగ్ జరుగుతున్నట్లు గ్రామానికి చెందిన నామన బుజ్జి ఫిర్యాదు చేశారని అన్నారు. అటువంటి ర్యాంపులు పై నిఘా ఉంచామని ఇంచార్జ్ తాసిల్దార్ తెలిపారు.

# గాంధీనగరలో మంచినీటికి కటకట

## మహిళల ఆవేదన



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** అల్లూరి సీతారామా రాజు జిల్లా జి మాడుగుల మండలకేంద్రంలో గాంధీనగరం వీధిలో ప్రజలు. తీవ్ర మంచినీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గాంధీనగరం వీది లో సుమారు 80 కుటుంబ లు ఉన్నాయ.గ్రామంలో సోలార్ మంచినీటి పంపు,ఒకటి చేతి బోరు ఉన్న ఇంటికి ఒక బిందెడు నీరు రావడంలేదని గ్రామానికి దూరం లో ఉన్న పెంట్రోల్ బంకు పక్కన ఉన్న కుండీదగ్గరకు ఘాటీ ఎక్కి నీటిని తెచ్చుకో వలసి వస్తుంది, అనీ మరి చేతి బోరు ఉన్నా బిందెడు. నీటిని పట్టుకోడానికి అరగంట పైనే పడుతుందనిద మహిళలు ఆవేదన వ్యక్తము చేస్తున్నారు. కోట్లాది రూపాయలు. పెట్టి నిర్మించిన మంచినీటి పథకం. పథకం ఏ ఒక్క రోజు చుక్క నీరు. వచ్చిన పాపాన పోలేదని గాంధీనగర వీది వాసులు. ఆవేదన వ్యక్తము చేస్తున్నారు.ఇప్పటి అయన అధికారులు స్పందించి తమ గ్రామంలో మంచినీటి సమస్య ను పరిస్కారం చేయాలనీ గాంధీనగరం మహిళలు కోరుతున్నారు.

# ప్రపంచ క్షయ వ్యాధి నివారణ ర్యాలీ




**కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):-** ప్రపంచ క్షయ వ్యాధి నివారణ సందర్భంగా రాజేంద్రపాలెంలో పిహెచ్సి సిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. సోమవారం స్థానిక పిహెచ్సి నుంచి రాజేంద్రపాలెం దొడ్డవరం జంక్షన్ వరకు వెళ్లి క్షయ వ్యాధి నివారణ కోసం పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ప్రశాంత్ తో పాటు ఆసుపత్రి సిబ్బంది విద్యార్థినిలు పాల్గొన్నారు.

# అనకాపల్లి - చోడవరం రోడ్డును బాగు చేయాలి

## దాడి రత్నాకర్ డిమాండ్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి నియోజకవర్గం, అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే రోడ్డు గుంతలతో చాలా అధ్వానంగా ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అన్నారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ అనకాపల్లి నుండి చోడవరం వెళ్లే రోడ్డు మార్గంలో దర్జీ నగర్ జంక్షన్ వద్ద రోడ్డు పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు గురి అవుతున్నారని అన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో ఎంతోమంది నాయకులు, మంత్రులు, అధికారులు ఉన్నప్పటికీ కూడా ఈ రోడ్డు ను ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా బాగు చేయ లేదని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని ప్రతి రోడ్డు బాగు చేయాలని లేకుంటే కొత్త రోడ్లు వేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి సుమారు 800 కోట్ల రూపాయలు మంజూరు చేసి ఉన్నారని అన్నారు. దానిలో భాగంగానే రాష్ట్రంలో అన్ని ప్రధాన రోడ్లను రిపేర్లు చేయడం గాని, కొత్త రోడ్లు వేయడం గాని చేశారని అన్నారు. కానీ అనకాపల్లిలో ఉన్న అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ముఖ్యంగా రోడ్లు భవనాల శాఖ అధికారులు అనకాపల్లి జిల్లా అయిన తర్వాత కూడా అనకాపల్లి చోడవరం రోడ్డులో ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారని, ముఖ్యంగా రోడ్డు మీద నుంచి వచ్చే దుమ్ము ధూళి వలన రోడ్డుకి ఇరువైపులా ఉన్న గృహస్తులు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని, ముఖ్యంగా లారీలు నుండి చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తద్వారా స్థానిక ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తూ ఈ రోడ్డు సంగతి పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. కనీసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలను కూడా పెడ చెవిన పెట్టి నిమ్మకు నీరెత్తినట్టు ప్రవర్తిస్తున్నారని అన్నారు. వారం రోజుల్లోగా ఈ రోడ్డును బాగుచేసే పనులు మొదలు పెట్టాలని లేదంటే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని అన్నారు . రానున్న ఉగాది లోపు వారం రోజుల్లో ఈ రోడ్డును యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేసి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురాకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డపాటి చిన్న రాజారావు, ఇంటి త్రినాథ్, కాంద్రేగుల రవి కిషోర్, మోల్లీ రమణ బాబు, ఓమ్ని శ్రీను, స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏకపక్షంగా నిర్ణయించిన టీడీఆర్ బాండ్లు మాకొద్దు : సీపీఎం




**రాంబిల్లి, (విశాఖ సమాచారమ్):-** అచ్యుతాపురం నుండి అనకాపల్లి రోడ్డు విస్తరణ నిర్వాసితులు ఆమోదం లేకుండా శంకు స్థాపనలు చేయొద్దు, అని అచ్చుతాపురం నుండి అనకాపల్లి రోడ్డు వెయాలి అయితే భూములు, ఇల్లు ,షాపులు కోల్పోతున్న భూ నిర్వాసితుల తో చర్చించకుండా టిడిఆర్ బాండ్లు ఇస్తామని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించడానికి సిపిఎం అచ్చుతాపురం మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ఈరోజు జరిగిన సిపిఎం అచ్యుతాపురం మండల కమిటీ సమావేశంకి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి .కోటేశ్వరావు మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహించకుండ ఏకపక్షంగా టిడిఆర్ బాండ్లు ప్రకటించడం అన్యాయమని నగదు రూపంలో చెల్లించి భూము లు, ఇల్లు, కోల్పోయిన వారికి పునరావాశం కల్పించి నష్టపరిహారం ఇవ్వాలని, ప్రస్తుత మార్కెట్ ప్రకారం ఇచ్చి 2013 భూ సేకరణ చట్టం అమలు చేసి బాధితులకు న్యాయం చేయాలని, రోడ్డు విస్తరణలో నష్టపోతున్న చిరు వ్యాపారులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అచ్చుతాపురం కన్వీనర్ ఆర్. రాము, సిపిఎం సీనియర్ నాయకులు కాంద్రేకుల. రాము సదాశివరావు ,కర్రి .అప్పారావు ,బుద్ధ .రంగారావు, పూడిమడక శాఖ కార్యదర్శి చాపల .తాతయ్య,, అచ్చుతాపురం శాఖ కార్యదర్శి కే సోమనాయుడు ,హరిపాలెం శాఖ కార్యదర్శి బి .రామ్ కుమార్ పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

## జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):** ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో ప్రజలు అందజేసిన అర్జీలను గడువులోపల పరిష్కరించాలని జాయింటు కలెక్టరు ఎమ్. జాహ్నవి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, కె.ఆర్.సి.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి, గృహనిర్మాణశాఖ ప్రోజెక్టు డైరెక్టరు వై. శ్రీనివాస్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.పి.జి.ఆర్.ఎస్. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, అర్జీలు రీ-ఓపెన్ కాకుండా అర్జీ పరిష్కారం అనంతరం అర్జీదారునితో మాట్లాడి పూర్తివివరాలు తెలియజేయాలని జాయింటు కలెక్టరు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పరిష్కార వేదికకు 30 ఫిర్యాదులు

- ప్రజా సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలి
- సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ
- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన 30 ఫిర్యాదుల్లో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర సమస్యలు ఉన్నట్లు గుర్తించారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారు నేరుగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఫిర్యాదులన్నింటిపైనా చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, ఎస్సై డి.వెంకన్న పాల్గొన్నారు.

# ఎంపీటీసీలు, సీనియర్ నాయకులతో సమీక్ష

- ఏపీ టీడీసీ డైరెక్టర్ , కిల్లు వెంకట రమేష్ నాయుడు
- మాజీ మంత్రి. ఎం మాణికుమారి



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** జి మాడుగుల మండల కేంద్రంలో ఏపీ టీడీసి డైరెక్టర్ తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిల్లు వెంకట రమేష్ నాయుడు , మాజీ మంత్రి మత్స్య రాస మణి కుమారి తెదేపా నాయకులతో సమావేశమయ్యారు.తెదేపా పార్టీ కున్న ఎంపిటిసిల సంఖ్యను అలాగే ఇతర పార్టీల ఎంపీటీసీల వివరాలను తెలుసుకున్నారు.ఎంపీపీ ఎలక్షన్ కు సంబంధించి ముఖ్యమైన విషయాలను సీనియర్ నాయకులతో చర్చించి మన అభ్యర్థిని గెలిపించడానికి పలు సూచనలు ఎంపిటిసి లకు సీనియర్ నాయకులకు మత్స్య రస మణి కుమారి, కిల్లు వెంకట రమేష్ నాయుడు వివరించారు. ఇతర పార్టీ ఎంపీటీసీలతో ఇష్టగోష్టిగా మాట్లాడి మన పార్టీ అభ్యర్థికి మద్దతు ఇచ్చే విధంగా పలు విషయాలు సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమల చిట్టిబాబు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కోడా .వెంకట సురేష్ కుమార్,మండల పార్టీ అధ్యక్షులు వంతల కొండలరావు ఎంపీటీసీలు, ఎంపీపీ కళ్యాణి,మాజీ ఎం పి పి గెమ్మెలి పద్మ. సర్పంచులు, జనసేన భీమన్న,పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

## ప్రిన్సిపల్ డాక్టర్ విజయభారతి




**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):-** అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలో నిర్వహించే రక్తదాన శిబిరంలో భాగంగా శనివారం చింతపల్లి డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయభారతి ప్రారంభించి ఆమె కూడా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. విద్యార్థినీ విద్యార్థులు అపోహలు విడనాడి రక్తదానం చేసి ప్రాణాపాయంలో ఉన్నవారికి ప్రాణదాతలు కావాలని ఆమె పిలుపునిచ్చారు. విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ రక్తదాన శిబిరంలో 52 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, జిల్లా వైస్ చైర్మన్ గంగరాజు, కార్యదర్శి గౌరీ శంకర్ కోశాధికారి సూర్యారావు, సభ్యులు ప్రసాద్ నాయుడు, డాక్టర్ రాఘవేంద్రరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలల సంక్షేమ సమితి, న్యాయ మండలిలో

# దరఖాస్తుల ఆహ్వానం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** జిల్లాలోని బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయ మండలిలలో సభ్యులను నియమించుటకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు మరియు వీధి బాలల సంక్షేమ శాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి వై. చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సంచాలకులు, బాలల సంక్షేమము, సంస్కరణల సేవలు మరియు వీధి బాలల సంక్షేమ శాఖ, ఆం.ప్ర., విజయవాడ వారు రక్షణ, ఆదరణ కరవైన పిల్లలు మరియు నేరారోపణ చేయబడిన పిల్లల కేసులను పరిష్కరించేందుకు అనకాపల్లి జిల్లాలోని బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయ మండలిలలో సభ్యులను నియమించుటకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తూ 22.03. 2025 తేదీన ఒక ప్రకటన విడుదల చేశారని తెలపారు. దీని గురించిన పూర్తి నోటిఫికేషన్, అర్హతల వివరాలు మ రియు దరఖాస్తుఫారం %ఫ్ట్రజూం://షఎషఖజూ.ఫ్రశీజ.ఱఅ% అనే వెబ్సైట్ నుంచి పొందవచ్చునని, ఆసక్తి గల, అర్హత గల అభ్యర్థులు సదరు వెబ్సైట్ నుండి వివరాలు మరియు అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకొ ని ఏప్రిల్ 9 వ తేదీ లోగా డైరెక్టరు, బాలల సంక్షేమము, సంస్కరణల సేవలు మరియు వీధి బాలల సంక్షేమ శాఖ, విజయవాడవారికి పంపవలసినదిగా కోరారు. తదుపరి సమాచారం కొరకు జిల్లా పర్యవేక్షణ అధికారి వారిని ఫోన్ నెంబరు 9030153369 నంబరులో సంప్రదించవచ్చునని తెలియజేసారు.

# మందులు కొరత లేకుండా చూడండి



**కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):-** రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చికిత్స చేయాలని డాక్టర్ సంపత్ కుమార్ కు అడిషనల్ డిఎం అండ్ హెచ్ ఓ ప్రతాప్ తెలిపారు.. సోమవారం రాజేంద్రపాలెంలోని పిహెచ్సి ని అడిషనల్ డీఎంహెచ్వో ప్రతాప్ తనిఖీ చేశారు. అలాగే ఆసుపత్రిలోనే రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం డాక్టర్ సంపత్ బాబు, సి హెచ్ ఓ ప్రశాంత్ తో మాట్లాడుతూ.. హాస్పిటల్ కి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు మందులు ఏ మేరకు లభ్యం అవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడా సమాచారమ్

## నా తమ్ముడు కట్టప్పనా..?

### దీపక్ చాహర్ సోదరి పోస్ట్ వైరల్



**ఇంటర్నెట్ డెస్క్:** ముంబయి తరపున తొలి మ్యాచ్ ఆడిన దీపక్ చాహర్‌పై వచ్చిన మీమ్స్‌ను అతడి సోదరి సోషల్ మీడియాలో పంచుకుంది. ప్రస్తుతం ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. ఐపీఎల్ లో కొన్నేళ్ల పాటు చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఫాస్ట్ బౌలర్ దీపక్ చాహర్ ఈ సీజన్‌లో ముంబయి ఇండియన్స్‌కు ఆడుతున్న సంగతి తెలిసిందే. ఆదివారం ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా.. ముంబయిపై చెన్నై నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. అయితే, ఈ మ్యాచ్ సందర్భంగా దీపక్ చాహర్ పై వచ్చిన మీమ్స్‌ను అతడి సోదరి మాలతి ఇన్‌స్టాలో షేర్ చేసింది. అందులో తన సోదరుడిని 'కట్టప్ప'తో పోల్చినట్లుగా ఉండటంపై ఆమె నవ్వులు చిందించింది. ఆ మీమ్‌లో ముంబయి జెర్సీతో ఉన్న దీపక్ ఫొటో కింద.. బాహుబలి సినిమాలో ప్రభాస్‌ను కట్టప్ప వెన్నుపోటు పొడిచిన సీన్ దృశ్యం ఉంది. దీన్ని షేర్ చేసిన ఆమె నవ్వుతున్న ఎమోజీలను జత చేసింది.

**ధోనీని స్లెడ్జ్ చేయబోయి..**

ఇక, నిన్నటి మ్యాచ్‌లో మరో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. చెన్నై ఇన్నింగ్స్ సమయంలో బ్యాటింగ్‌కు వచ్చిన ధోనీపై దీపక్ చాహర్ సరదాగా స్లెడ్జింగ్ చేయబోయాడు. అతడికి చాలా దగ్గరగా ఫీల్డింగ్ చేస్తానన్నాడు. ధోనీ.. ధోనీ అంటూ చప్పట్లు కొట్టాడు. మ్యాచ్ గెలిచిన అనంతరం ధోనీ దాన్ని గుర్తుచేసుకుంటూ చాహర్‌ను బ్యాట్‌తో కొట్టినట్లుగా జోక్ చేశాడు.

2018 నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన దీపక్ చాహర్‌ను గతేడాది వేలానికి ముందు ఆ జట్టు రిటైన్ చేసుకోలేదు. దీంతో అతడు వేలంలోకి వచ్చాడు. ఈ ఫాస్ట్ బౌలర్ కోసం చెన్నై గట్టిగా పోరాడినా.. ముంబయి ఇండియన్స్ రూ.9.25 కోట్లకు సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో దీపక్ బ్యాట్‌తో రాణించాడు. ముంబయి ఇన్నింగ్స్ ఆఖర్లో అతడు (28 నాటౌట్‌బీ 15 బంతుల్లో 2x4, 2x6) బ్యాట్ ఝుళిపించడంతో ఆ జట్టు పోరాడే స్కోరు చేయగలిగింది. ఆ తర్వాత బౌలింగ్‌లోనూ 2 ఓవర్లలో 18 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు.

## లఖ్‌నవూకు తప్పని ఎదురుచూపులు

### మయాంక్ యాదవ్‌కు మళ్లీ గాయం?



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్‌లోనే అత్యంత వేగవంతమైన బంతిని సంధించిన భారత బౌలర్‌గా మయాంక్ యాదవ్ రికార్డు సృష్టించాడు. కానీ, అతడిని కూడా గాయాలు అదేస్థాయిలో ఇబ్బంది పెడుతున్నాయి. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆయా జట్లకు గాయాల బెడద తప్పడం లేదు. కొన్ని మ్యాచ్‌లకు ముంబయికి స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా దూరమయ్యాడు. ఏప్రిల్ తొలివారంలో వచ్చేస్తాడని తెలుస్తోంది. మరోవైపు లఖ్‌నవూ పేస్ సంచలనం మయాంక్ యాదవ్ పరిస్థితి విభిన్నంగా మారింది. గాయాల నుంచి కోలుకుంటూ మ్యాచ్‌లకు సిద్ధమవుతోన్న మయాంక్ తాజాగా మరోసారి గాయపడినట్లు ఎల్ఎస్‌జీ కోచ్ జస్టిన్ లాంగర్ వెల్లడించాడు. దీంతో అతడి ఎంట్రీ ఏప్రిల్‌లోనే ఉంటుందని స్పష్టం చేశాడు. ఐపీఎల్‌లో వేగవంతమైన బంతిని (156.7 కి.మీ) విసిరి అందరి దృష్టిని ఆకర్షించిన మయాంక్‌కు వరుస గాయాలు తలనొప్పిగా మారాయి. టీమ్ఇండియా లోకి అవకాశం వచ్చినా సరే ఫిట్‌నెస్ లేకపోవడంతో దూరం కావాల్సివచ్చింది. తాజాగా అనుకోనిరీతిలో మళ్లీ గాయపడ్డాడు. మరికొన్ని రోజులు విశ్రాంతి తీసుకొంటాడని లాంగర్ వెల్లడించాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో విశాఖపట్నం వేదికగా లఖ్‌నవూ తలపడనుంది. ఈక్రమంలో లాంగర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు.

"ప్రతిఒక్కరూ మయాంక్ బౌలింగ్‌ను చూసి సంతోషించారు. ఈ సీజన్ కోసం చాలా కష్టపడ్డాడు. గాయాల నుంచి కోలుకొనేందుకు శ్రమించాడు. కానీ, తాజాగా మరోసారి అతడి మునివేళ్లకు గాయమైంది. ప్రమాదవశాత్తూ మంచం తాకడంతో ఇన్‌ఫెక్షన్ వచ్చింది. దీంతో అతడు మళ్లీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు వెళ్లాడు. ఓ వారం లేదా రెండు వారాల్లో కోలుకొని జట్టుతో కలుస్తాడు. ఇప్పుడు రన్నింగ్ చేస్తున్నప్పటికీ.. పూర్తిస్థాయిలో బౌలింగ్ చేసే అవకాశాలు లేవు. అతడి ప్రాక్టీస్ వీడియోలను చూస్తూనే ఉన్నాం. నిన్న కూడా చూశా. టోర్నీ మధ్యలో వచ్చే అవకాశం ఉంది" అని లాంగర్ తెలిపాడు.

**వారిద్దరూ ఓకే..**

కీలక పేసర్లు గాయాలపాలవడం లఖ్‌నవూకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికే మోసిన్ ఖాన్ టోర్నీకే దూరమైన సంగతి తెలిసిందే. అవేశ్‌ఖాన్, ఆకాశ్ దీప్ పరిస్థితి కాస్త ఫర్వాలేదు. అయితే, మ్యాచ్‌లో ఆడటంపై ఇంకా అనుమానాలు కొనసాగుతూనే ఉన్నాయి. వారి ఫిట్‌నెస్‌పై లాంగర్ స్పందిస్తూ.. "అవేశ్ ఖాన్, ఆకాశ్ దీప్ ఫిట్‌నెస్ పరంగా బాగానే ఉన్నారు. ఆకాశ్ 90 శాతం బౌలింగ్‌కు సిద్ధమయ్యాడు. తప్పకుండా యో యో టెస్టును పాస్ అవుతాడని భావిస్తున్నా" అని లాంగర్ వెల్లడించాడు.

**ఆటగాళ్లు తారుమారు..**

గత సీజన్ వరకు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను కేఎల్ రాహుల్ నడిపించాడు. ఈసారి అతడు ఢిల్లీకి మారిపోయాడు. ఇక రిషభ్ పంత్ డీసీకి సారథిగా వ్యవహరించాడు. ఇప్పుడు మాత్రం ఢిల్లీకి కేఎల్ రాహుల్ వెళ్లిపోయాడు. అక్కడ బ్యాటర్‌గానే కొనసాగుతాడు. ఢిల్లీ కెప్టెన్సీ అక్షర్ పటేల్‌కు దక్కిన సంగతి తెలిసిందే. ఇక లఖ్‌నవూ సారథిగా రిషభ్ పంత్ ను తీసుకున్న సంగతి తెలిసిందే. గత మెగా వేలంలో రూ.27 కోట్లకు ఎల్ఎస్‌జీ సొంతం చేసుకుంది.

## మలప్పురం మణికట్టు మాంత్రికుడు విఘ్నేశ్..

### మరో కుల్‌దీప్ అవుతాడా?



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్.. యువ క్రికెటర్లకు అద్భుతమైన వేదిక అని మరోసారి రుజువైంది. టీమ్ఇండియాకు ఆడుతోన్న చాలామంది కుర్రాళ్లు ఈ లీగ్‌లోనే మెరిసి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించారు. ఈ జాబితాలోకి మరో యువ స్పిన్నర్ విఘ్నేశ్ పుతుర్ చేరాడు. తొలిసారి ఐపీఎల్‌లో అడుగుపెట్టిన ఈ కుర్రాడు నాణ్యమైన ప్రదర్శనతో దిగ్గజం ఎంఎస్ ధోనీ నుంచి మెప్పు పొందడం విశేషం. ముంబయి తరఫున బరిలోకి దిగిన విఘ్నేశ్ నాలుగు ఓవర్ల కోటాలో 32 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. స్పిన్ బౌలింగ్‌ను దంచేసే దీపక్ హుడా, శివమ్ దూబెను ఔట్ చేశాడు. దూకుడుగా ఆడిన రుతురాజ్‌ను కూడా పెవిలియన్‌కు పంపాడు. రోహిత్‌కు బదులు ఇంపాక్ట్‌గా వచ్చి సత్తా చాటాడు. మరి ఇలాంటి ప్రదర్శన చేసిన విఘ్నేశ్ చిన్నప్పటినుంచి ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఈ స్థాయికి చేరాడంటే అద్భుతమనే చెప్పాలి.

**తండ్రి ఆటో డ్రైవర్..**

24 ఏళ్ల విఘ్నేశ్ కేరళ తరఫున సీనియర్ క్రికెట్ ఆడుతున్నాడు. అతడి తండ్రి సునీల్ కుమార్ ఓ ఆటో డ్రైవర్. విఘ్నేశ్ తల్లి బింధు గృహిణి. ఆర్థికంగా కష్టాలు ఉన్నా సరే అతడి ఇష్టాలను మాత్రం కాదనకుండా పెంచారు. క్రికెట్ ప్రయాణం కొనసాగించడంలో వీరి పాత్రే కీలకం. మలప్పురంలో పుట్టిన విఘ్నేశ్ క్రికెట్ పాఠాలను నేర్చుకొనేందుకు త్రిస్సూర్‌కు మారిపోయాడు. కళాశాల స్థాయిలో అతడు మీడియం పేసర్‌గా మొదలుపెట్టిన అతడు తర్వాత స్పిన్నర్‌గా మారాడు. మాస్టర్ ఆఫ్ లిటరేచర్ చేసిన సెయింట్ థామస్ కాలేజీ తరఫున అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించాడు. దీంతో కేరళ క్రికెట్ లీగ్ తొలి సీజన్‌లో అలెప్పీ రిపిల్స్ జట్టుకు ఆడే అవకాశం దక్కింది. ఆ తర్వాత తమిళనాడు ప్రీమియర్‌లీగ్‌లోనూ అడుగు పెట్టాడు. కేరళ తరఫున అండర్-23 క్రికెట్ ఆడాడు.

**మరో కుల్‌దీప్ అవుతాడా?**

కేసీఎల్ సమయంలో ముంబయి ఇండియన్స్ అతడిలోని ప్రతిభను గుర్తించింది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ.30 లక్షలకు సొంతం చేసుకుంది. ఈ సీజన్ ప్రారంభానికి ముందు అతడిని ఎస్ఏ 20 లీగ్‌కు పంపించింది. అక్కడ ముంబయి కేప్‌టౌన్ జట్టు నెట్‌బౌలర్‌గా



సేవలందించాడు. రషీద్‌ఖాన్ వంటి టాప్ స్పిన్నర్‌తో ట్రైనింగ్ అయ్యే అవకాశం విఘ్నేశ్‌కు దక్కింది. అతడిని చూస్తుంటే మరో కుల్‌దీప్ యాదవ్‌లా అవుతాడని ప్రముఖ కామెంటేటర్ హర్షాభోగ్లే వ్యాఖ్యానించాడు. చెన్నైతో మ్యాచ్‌లోనూ 70 కి.మీ. వేగంతో ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ సంధించే ఫ్లైటెడ్ డెలివరీలను ఆడటంలో బ్యాటర్లకు ఇబ్బంది తప్పలేదు. కుల్‌దీప్‌లా స్లో టర్న్ బంతులను వేయడంలో విఘ్నేశ్ కూడా నేర్పరే అనేది క్రికెట్ విశ్లేషకుల మాట. మణికట్టుతో అద్భుతాలు కుల్‌దీప్‌ను రిప్లేస్ చేయదగ్గ నైపుణ్యం విఘ్నేశ్‌లో ఉంది.

**ధోనీ నుంచి ప్రశంసలు..**

ఒక దశలో ముంబయితో మ్యాచ్‌ను సులువుగా సీఎస్కే సొంతం చేసుకుంటుందని అంతా భావించారు. లక్ష్యం కూడా 160 లోపే కావడమే దీనికి కారణం. రచిన్ (65), రుతురాజ్ (53) హాఫ్ సెంచరీలు చేశారు. అంతా సాఫీగా సాగిపోతున్నవేళ.. విఘ్నేశ్ బౌలింగ్‌తో ముంబయి చివరివరకూ పోరాడేలా చేశాడు. దీంతో యువ క్రికెటర్ ప్రదర్శనను చూసిన ధోనీ మ్యాచ్ చివర్లో ప్రత్యేకంగా అభినందించాడు.

## గోవాడలో డిస్టలరీ ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్

- 100% సహకార రంగం లోనే డిస్టలరీ నిర్వహణలి
- గోవాడ షుగర్ ఫ్యాక్టరీ రైతులకు న్యాయం చేసే బాధ్యత నాదే
- ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు



**చోడవరం, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు మాట్లాడుతూ స్థానిక గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పై రాజకీయాలు చేయవద్దని, రాజకీయాల కోసం రైతులను రెచ్చగొట్టి ప్రతి పక్షాలు సాధించేది ఏమీ లేదని తెలిపారు.తాను ప్రజాల మనిషినని,రైతుల పక్షపాతినని ఈ విషయం నియోజకవర్గ పరిధిలోని అందరికీ తెలుసునని తెలిపారు.ఖచ్చితం గా గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కి పూర్వ వైభవం తీసుకు వస్తామన్నారు.

రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం షుగర్ ఫ్యాక్టరీ లో డిస్టలరీ ఏర్పాటుకు సీఎం ను కలిసి వివరించామని దానికి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, డీపీఆర్ తయారు చేయమని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ కు ఆదేశాలిచ్చారని తెలిపారు.చక్కెర కర్మాగారంలో 240 కె.ఎల్. సామర్థ్యంతో డిస్టి లరీ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కేఎస్ఎన్ ఎస్ రాజు తెలిపారు. కర్మాగా దానికి ఆర్థికంగా ఆదుకోవడం తోపాటు అనుబంధ పరిశ్రమల ఏర్పాటు కోరుతూ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారా యణమూర్తితో కలిసి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడికి విన్నవించినట్లు చెప్పారు. చక్కెర ఉత్పత్తి అయ్యే ఖర్చు కంటే మార్కెట్లో తక్కు వకు పంచదార విక్రయించాల్సి రావడంతో కర్మాగారానికి నష్టం వస్తోందన్నారు. తక్షణ సాయంగా ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడం కంటే. శాశ్వత పరి ష్కారం చూపేందుకు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఇథనాల్ / డిస్టిలరీ యూనిట్ ప్రతిపాదన వచ్చిందన్నారు. డిస్టిలరీ, బ్లాటింగ్ యూనిట్ సహకార రంగంలోనే ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొ న్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం ఆరు శాతం వడ్డీపై రుణం ఇస్తుందన్నారు. యూనిట్ ఏర్పాటుకు రూ.300కోట్లు, ముడి సరకు కొనుగోలుకు రూ. 40 కోట్లు రుణం అవసరమవు తుందని ముఖ్యమంత్రికి అందజే సిన ప్రతిపాదనల్లో పేర్కొనట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారని, సమగ్ర నివేదిక రూపొందించాలని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ కు ఆదేశాలిచ్చారన్నారు. కర్మాగారం తీసుకున్న రుణాలను రీషెడ్యూల్ చేయాలని, నిర్వహణ బాధ్యతలు చూసేం దుకు ఎండీగా ఐఏఎస్ అధికారిని నియమించాలని సీఎంను కోరినట్లు చెప్పారు. ఎంపీ సీఎం. రమేష్ త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని అంశాలు చర్చిస్తామన్నారు.

## ఘనంగా హోం మంత్రి అనిత జన్మదిన వేడుకలు

- మంత్రి అనితకు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు
- మెగా రక్తదాన,వైద్య శిభిరాలు ఏర్పాటు.
- పలుచోట్ల కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్న నాయకులు, కార్యకర్తలు
- పేదలకు దుస్తులు పంపిణి
- నక్కపల్లి హెూం మంత్రి క్యాంపు కార్యాలయంలో పండగ వాతావరణం



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత జన్మదిన వేడుకలు నక్కపల్లి క్యాంప్ కార్యాలయం వద్ద ఘనంగా జరిగాయి.పలు చోట్ల నాయకులు,కార్యకర్తలు కేక్ లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కూటమి నేతలు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా జన్మదిన వేడుకల్లో పాల్గొని మంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంతో నక్కపల్లి మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద పండుగ వాతావరణం నెలకుంది.మంత్రి అనిత పుట్టినరోజు సందర్భంగా ఐ టిడిపి,టిఎన్ ఎస్ ఎఫ్,తెలుగు యువత ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిభిరం ఏర్పాటు చేసారు.300 మంది యువకులు ఈ రక్తదాన శిభిరంలో పాల్గొన్నారు.అపోలో హాస్పటల్ ఆద్వర్యంలో ఫ్రీ మెడికల్ క్యాంప్ నిర్వహించారు.పేదలకు మంత్రి అనిత దుస్తులు పంపిణీ చేశారు.క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలకు మంత్రి నగదు బహుమతులు అందజేసి,క్రీడాకారులకు శు భాకాంక్షలు తెలిపారు.

## జిమ్ వార్షికోత్సవ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** నగరంలోని వన్ టౌన్ ఏరియాలో గల టౌన్ కొత్త రోడ్ ఏరియాలో గల మధు జిమ్ ఇనిస్టిట్యూట్ నాలుగో వార్షికోత్సవ వేడుకలు పురస్కరించుకొని మెగా రక్తదానాన్ని నిర్వహించారు. జిమ్ లో శిక్షణ పొందుతున్న దాదాపు 40 మంది ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని తమ సేవ నిరతీ చాటుకున్నారు. నిర్వాహకుడు మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, ద్రోణ%శీ%రాజు శ్రీవాత్సవ హాజరై రక్త దాతలను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. చత్రపతి శివాజీ స్వచ్ఛంద రక్తదాన సంస్థ ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు మధు తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని క్రమం తప్పకుండా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి అతిధులుగా హాజరైన వక్తలు మధు సేవలను ప్రశంసించారు.

## క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

### - జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా



**కాకినాడ రూరల్, (విశాఖ సమాచారమ్):-** ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా కాకినాడ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో నిర్వహించిన అవగాహన ర్యాలీని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ జేడీ్ప జంక్షన్ మీదుగా జ్యోతిబాపూలే విగ్రహం వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ టిబిని అంతం చేయగలం అన్న నినాదంతో ఈ నెల ఈ రోజు ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా టిబి వ్యాధిపై అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నమని చెప్పారు. 2025 నాటికి టిబి వ్యాధిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో పనిచేయడం జరుగుతోందని ఆయన తెలిపారు. జిల్లాలో టిబి వ్యాధి నిర్మూలకు వివిధ చర్యలను చేపట్టామనన్నారు. క్షయ అన్నది అంటువ్యాధి అని అనుమానిత లక్షణాలు ఉన్నవారు వెంటనే ఖల్లె పరీక్ష చేసుకొని వ్యాధిని నిర్ధారించుకోవాలని సూచించారు. రెండు వారాలకు మించిన దగ్గు జ్వరం ఆకలి మందగించడం బరువు తగ్గడం చాతిలో నొప్పి కఫంలో రక్తపు జీరలు రాత్రిపూట చెమట పట్టడం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది అలసటగా ఉండటం మెడవద్ద వాపు తదితర లక్షణాలు ఉంటే టిబి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డిసెంబరు 7న ప్రారంభించిన 100 రోజుల టిబి కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు నిర్ధారణా కార్యక్రమాన్ని కూడా నిర్వహించామని టిబి వ్యాధి సోకేందుకు ఎక్కువగా అవకాశం ఉన్న 60 ఏళ్లు దాటిన వారిని గుర్తించి వారికి బిసిజి టీకాలను వేయడం జరుగుతుందని జేసీ రాహుల్ మీనా తెలిపారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.జె.నరసింహ నాయక్ మాట్లాడుతూ టిబి రోగులు వ్యాధినుంచి వేగంగా బయటపడాలంటే వ్యక్తిగత కృషితోపాటు సామాజికంగా నైతిక సహకారం కూడా అవసరం అన్నారు. వైద్యులు సూచించిన మేరకు మందులు వాడుతూ తగిన జాగ్రత్తలను తీసుకొంటే ఆరు నెలల్లోనే టిబిని నయం చేయవచ్చునని చెప్పారు. టిబి వ్యాధుగ్రస్తులకు పోషకాహారం ఇతర సహాయ సహకారాలను అందించేందుకు నిక్షయ మిత్రలు కృషి చేయాలని కోరారు. ఒక్కో వ్యాధిగ్రస్తుడికి నెలకు రూ 700 ఇవ్వడం ద్వారా నిక్షయ మిత్రలుగా మారవచ్చునని చెప్పారు. ఎన్‌పిఐ కార్యక్రమంలో భాగంగా క్షయ రోగులకు రూ1000 చొప్పున ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. టిబి వ్యాధిని నయం చేసేందుకు అవసరమైన అన్ని రకాల మందులు, ఆధునిక పరికరాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని వివరించారు.

కార్యక్రమంలో జిల్లా టీవీ కంట్రోల్ అధికారి డా రమేష్ డా ప్రభకర్ వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు వివిధ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, For advertisements (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77390.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.